

పన్నులు.. 49.46%



అభివృద్ధి పనులు.. ఉద్యోగుల జీతాలు.. కార్యాలయ నిర్వహణకు నిధులు కావాలి. మున్సిపాలిటీల్లో ఆయా నిధులకు పన్నులే ఆధారం. అయితే అలాంటి పన్నుల వసూళ్లపై మున్సిపాలిటీలు ప్రత్యేక దృష్టి సారించాలి. కానీ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని కొన్ని మున్సిపాలిటీల్లో అధికారులు పన్నుల వసూళ్లపై కనీసంగా కూడా ప్రయత్నించడంలేదని డీఎంఏ కార్యాలయ గణాంకాలు తెలియజేస్తున్నాయి. గుంటూరు కార్పొరేషన్ సహా పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని అన్ని మున్సిపాలిటీల్లో ఆస్తి, నీటి పన్ను రూ.283.26 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.140.12 కోట్లు పన్ను వసూలు చేశారు. పన్ను వసూలు 49.46 శాతానికే పరిమితమైందంటే అధికారుల పనితీరు అర్థం చేసుకోవచ్చు. ఆదాయ వనరులను పెంపొందించుకోవడంలో మున్సిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఈ వసూళ్లను చూస్తే తెలుస్తోంది. మున్సిపాలిటీల్లో ఆస్తి, నీటిపన్ను బకాయిలు పేరుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. మున్సిపాలిటీలకు ఇచ్చిన లక్ష్యాల మేర పన్ను వసూలు జరగడం లేదు. సిబ్బంది అలసత్వంతో వసూలు మందకొడిగా సాగుతోంది. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నా మున్సిపాల్టీల్లోని అధికారులు సరైన రీతిలో స్పందించడంలేదని బకాయిలను చూస్తే తెలుస్తోంది. ఏటికేడు బకాయిలు పేరుకుపోతున్నాయే కాని వసూళ్లపై అధికారులు దృష్టి సారించడంలేదు. అవినీతి, రాజకీయ ఒత్తిళ్లతో పన్నుల వసూళ్లలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి.

- వసూళ్లు అంతంత మాత్రమే
- మున్సిపాల్టీల్లో భారీగా బకాయిలు
- లక్ష్యాల మేర వసూళ్లలో అధికారులు విఫలం
- లక్ష్యం రూ.283.26 కోట్లు.. వసూలు రూ.140.12 కోట్లు
- టాప్ టెన్‌లో వినుకొండ, దాచేపల్లి, మంగళగిరి, చీరాల
- ఈ నెలాఖరుకు నూరు శాతం వసూలు చేయాలని ఆదేశాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పురపాలక సంఘాలకు ప్రధాన ఆదాయ వనరు.. పన్నులు. ఇలాంటి పన్నుల వసూళ్లలో మున్సిపాలిటీలు వెనుకబడిపోతున్నాయి. పన్నుల వసూళ్లలో కనీస ప్రయత్నం కూడా ఉండటం లేదని ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలైన పన్నులను చూస్తే తెలుస్తోంది. ఇక లక్ష్యాల మేర పన్నుల వసూళ్లు జరగకపోతుండ టంతో ఆ ప్రభావం ఉద్యోగుల జీతాలు, అభివృద్ధి పనులపై పడుతోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాలి టీల్లో పన్ను వసూలు అంతంతమాత్రంగానే ఉంది. ప్రగతి పనుల నిర్వాహణకు ప్రధాన వనరుగా ఉన్న పన్ను వసూళ్లలో మున్సిపా లిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తాజా గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఆస్తి, నీటి పన్ను వసూలు మొక్కుబడిగా సాగుతోంది. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడంతో సిబ్బంది నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో కొన్ని మున్సిపాలిటీలు చతికిల పడుతున్నాయి. రాష్ట్ర స్థాయిలో వినుకొండ, దాచేపల్లి, తాడేపల్లి.. మంగళగిరి, చీరాల పురపాలక సంఘాలు మొదటి పదిస్థానాల్లో ఉన్నాయి. ఆస్తి పన్ను రూ.229 కోట్లకు రూ.128.89 కోట్లు వసూలు కాగా అది 56.28 శాతంగా ఉంది. నీటి పన్ను రూ.54.26 కోట్లు వసూలు లక్ష్యం కాగా ఇప్పటికి రూ.11.26 కోట్లు వసూలు కాగా అది 20.75 శాతంగా ఉంది. ఈ నెలాఖరు కల్లా నూరు శాతం పన్ను వసూలు చేయాలని మున్సిపాల్టీలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇచ్చిన లక్ష్యాలను వినుకొండ, దాచేపల్లి పురపాలక సంఘాలు మినహా గుంటూరు కార్పొరేషన్‌తో పాటు ఏ ఒక్క పురపాలక సంఘం చేరుకోలేదు. చిలకలూరిపేట మున్సిపాల్టీ, గుంటూరు కార్పొరేషన్ పన్ను వసూళ్లలో వెనుకబడి ఉన్నాయి. చిలకలూరిపేట మున్సిపాల్టీలో పన్నుల వసూళ్లు 36శాతం లోపే ఉంది. గుంటూరు కార్పొరేషన్‌లో 46 శాతం మాత్రమే వసూలు చేశారు. ఉన్నతాధికారులు పన్ను వసూళ్లపై సమీక్షిస్తున్నా మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. ఈ నెలాఖరులోగా నూరు శాతం పన్ను వసూలు చేయాల్సి ఉండగా ఆ పరిస్థితులు లేవనే చెప్పాలి. వచ్చే నెల 1 నుంచి పన్ను కొత్త డిమాండ్ రానున్నది.

ఆస్తి పన్ను వసూళ్లు (రూ.కోట్లలో)

మునిసిపాలిటీ	లక్ష్యం	వసూలు	శాతం
గుంటూరు జిల్లా :			
గుంటూరు కార్పొరేషన్	145.54	66.53	45.70
తెనాలి	13.42	9.92	73.90
మంగళగిరి, తాడేపల్లి	18.62	17.25	92.64
పొన్నూరు	3.06	2.19	71.60
పల్నాడు జిల్లా :			
నరసరావుపేట	8.93	5.24	58.70
చిలకలూరిపేట	8.53	3.00	35.10
వినుకొండ	2.57	3.64	141.50
సత్తెనపల్లి	3.86	2.04	52.90
మాచర్ల	2.99	1.73	58.00
పిడుగురాళ్ల	2.86	2.54	88.90
దాచేపల్లి	1.07	0.99	92.20
గురజాల	0.78	0.50	64.60
బాపట్ల జిల్లా :			
బాపట్ల	5.24	2.88	54.90
రేపల్లె	2.86	2.44	85.30
చీరాల	6.20	5.72	92.10
అద్దంకి	2.47	2.28	92.10

జిల్లాలో మొదటి, చివరి స్థానాలు

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో కొన్ని పన్ను వసూళ్లలో 50 శాతం దాటాయి. నూరుశాతం మించి పన్నులు వసూలు చేసి పల్నాడు జిల్లాలోని వినుకొండ మున్సిపాలిటీ 141.50 శాతంతో రాష్ట్రంలో మొదటి పది స్థానాల్లో నిలిచింది. ఇక చిలకలూరిపేట మున్సిపాలిటీ 35.10 శాతం మాత్రమే వసూలు చేసి ఉమ్మడి గుంటూరు జిలాల్లోనే చివరి స్థానంలో నిలిచింది. గుంటూరు జిల్లా విషయానికి వస్తే మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటీ 92.64 శాతం పన్నుల వసూలుతో జిల్లాలో ప్రథమ స్థానంలో ఉండగా గుంటూరు నగర పాలక సంస్థ 45.70 శాతంతో చివరి స్థానంలో ఉంది. ఒక బాపట్ల జిల్లాలో 92.10 శాతం పన్నుల వసూళ్లతో చీరాల, అద్దంకి మున్సిపాలిటీలు ప్రథమ స్థానంలో ఉండగా జిల్లా కేంద్రమైన బాపట్ల 54.90 శాతంతో చివరి స్థానంలో ఉంది.



వినుకొండ మునిసిపాలిటీ కార్యాలయం



చిలకలూరిపేట మునిసిపాలిటీ కార్యాలయం

డిఫాల్టర్లలో ప్రభుత్వ కార్యాలయాలు

కేంద్ర, రాష్ట్ర కార్యాలయాలకు సంబంధించిన పన్ను బకాయిలు మూడు జిల్లాల్లో రూ.కోట్లలో పేరుకుపోయాయి. డిఫాల్టర్ల జాబితాలో ఆయా ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయంటే ఆశ్చ ర్యం కాదు. మొండి బకాయిల్లో 70 శాతం వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన బకాయిలు ఉన్నాయి. గుంటూ రు కార్పొరేషన్ సహా అన్ని పురపాలక సంఘాల్లో 300 వరకు డిఫాల్టర్లను గుర్తించారు. పల్నాడు జిల్లాలో రూ.14.82కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.5.30 కోట్లు, గుంటూరు కార్పొరేషన్‌లో రూ.55.74కోట్లు డిఫాల్టర్ల నుంచి పన్ను వసూలు చేయాల్సి ఉంది.

జీతాలు చెల్లింపుల్లో జాప్యం

మున్సిపాలిటీల్లో నిధుల లేమితో అభివృద్ధి పనుల నిర్వహణ, కార్మికుల, ఉద్యోగుల జీతాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుంది. సకాలంలో పన్ను వసూలు కాకపోవడం వల్లే కొన్ని పురపాలక సంఘాల్లో ఈ పరిస్థితి నెలకుంది. సాధారణ నిధుల నుంచి చేపట్టే పనులు బిల్లులు చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండడంతో అవి నిలిచిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి.



కార్యదర్శుల.. పంచాయితీ

- గ్రేడ్ 5 పేరుతో అశాస్త్రీయ విభజన
- జీవో 85 ప్రకారం ఉన్నవి గ్రేడ్ 1, 2, 3, 4
- 1020 మంది పంచాయతీ కార్యదర్శులకు ఇబ్బందులు
- సచివాలయ సెక్రటరీల కోసం వైసీపీ ప్రభుత్వ వింత వాదన
- గ్రేడ్ 5 ఆధారంగా జరిపే బదిలీలను ఆపాలని డిమాండ్

గుంటూరు సిటీ, సెప్టెంబరు 26: సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిన వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులు పంచాయతీ కార్యదర్శులకు ప్రస్తుతం తలనొప్పిగా మారాయి. పంచాయతీ వ్యవస్థకు సమాంతరంగా తీసుకువచ్చిన సచివాలయాల వల్ల సర్వీసులో ఉన్న ఉద్యోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సచివాలయ కార్యదర్శి మనుగడ కోసం పాత ప్రభుత్వం గ్రేడ్ 5 పంచాయతీలు అంటూ తెచ్చిన విభజన కొత్త వివాదాన్ని సృష్టిస్తోంది. జీవో నెంబరు 85 ప్రకారం 2019 వరకు కేవలం గ్రేడ్ 1, 2, 3, 4 పంచాయతీలు మాత్రమే ఉన్నాయి. పంచాయతీల ఆదాయం ఆధారంగా వాటిని విభజించారు. రూ.5 లక్షలు పైబడి ఆదాయం వచ్చే పంచాయతీలను గ్రేడ్ 1 అని, రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు ఆదాయం వచ్చే వాటిని గ్రేడ్ 2 అని, రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చే వాటిని గ్రేడ్ 3 అని, రూ.లక్ష లోపు ఆదాయం వచ్చే పంచాయతీలను గ్రేడ్ 4 అని విభజించారు. గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి గా నియమించే వారికి సర్వీసును పరిగణనలోకి తీసుకుని అనుభవజ్ఞులకు అవకాశం ఇస్తారు. దానివల్ల గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా చేయించే వీలు ఉంటుంది. పంచాయతీ నిధులకు కూడా వారే పూర్తి జవాబుదారులు కావడం వల్ల అక్రమాలకు చాలా వరకు అవకాశం ఉండదు. ఈ పద్ధతిలో ఉన్న పంచాయతీ వ్యవస్థకు సచివాలయం ఉప్పెనలా పరిణమించింది.

అనుభవం లేని వారి చేతుల్లోకి..

గత వైసీపీ ప్రభుత్వం సచివాలయంలో కార్యదర్శి పేరుతో ప్రత్యేకంగా ఓ పోస్టును భర్తీ చేసింది. పంచాయతీ కార్యదర్శికి, సచివాలయ కార్యదర్శికి పెద్దగా సారూప్యత ఉండదు. చట్ట ప్రకారం విధులు కూడా వేర్వేరుగా నిర్ధేశించబడ్డాయి. అయినా జగన్ ప్రభుత్వం సచివాలయ కార్యదర్శిని, పంచాయతీ కార్యదర్శితో సమానంగా ఎంచుతూ వచ్చింది. ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్‌కు విరుద్ధంగా గ్రేడ్ 5ని తెరపైకి తెచ్చింది. పంచాయతీలను కూడా అదే రీతిలో విభజిస్తూ వచ్చారు. విభజనకు ప్రాతిపదిక ఆదాయమా, జనాభా అన్న దానిపై స్పష్టత లేకుండానే ముందుకు వెళ్లారు. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1020 గ్రామ పంచాయతీల్లో ఎక్కువ ఆదాయం ఉన్న పంచాయతీలు కూడా గ్రేడ్ 5లోకి వెళ్లాయి. ఉదాహరణకు ప్రత్తిపాడు మండలంలోని ఈదులపాలెం పంచాయతీ ఆదాయం రూ.34 లక్షలు. దాన్ని కూడా గ్రేడ్ 5 లోకి మార్చారు. ఇప్పుడు అంత ఆదాయం వచ్చే ఆ పంచాయతీని బొత్తిగా అనుభవం లేని సచివాలయ కార్యదర్శి చేతిలో పెట్టటం జరుగుతుంది. అసలు ఆదాయం లేని కొన్ని పంచాయతీలను గ్రేడ్ 1, 2, 3లలో చేర్చారు. ఉదాహరణకు ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామ పంచాయతీ ఆదాయం రూ.8 లక్షలు మాత్రమే. దానిని గ్రేడ్ 1 పంచాయతీగా నిర్ధారించారు. అనుభవం ఉన్న పంచాయతీ కార్యదర్శి ఆదాయం తక్కువ ఉన్న చోట, ఏ మాత్రం అనుభవం లేని సచివాలయ కార్యదర్శి ఆదాయం ఎక్కువగా ఉన్న చోట పని చేయాల్సి వస్తుంది.

విభజనపై పంచాయతీ కార్యదర్శుల నిరసన

చట్టంలో లేని గ్రేడ్ 5 పంచాయతీ విభజనపై నిరసన వ్యక్తమవుతోంది. సచివాలయ కార్యదర్శిని పంచాయతీ కార్యదర్శిగా నియమించడంపై వివాదం చెలరేగుతుంది. వారిని దృష్టిలో ఉంచుకుని పంచాయతీలను అశాస్త్రీయం గా విభజించారని పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. దానివల్ల తమకు అన్ని విధాల అన్యాయం జరుగుతుందని చెబుతున్నారు. గ్రేడ్ 5 పంచాయతీ జాబితా ఆధారంగా జరిపే బదిలీ ప్రక్రియను ఆపాలని డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీరాజ్ మంత్రి, కమిషనర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లామని చెబుతున్నారు.

మరో ఇద్దరు సీఐల
సస్పెన్షన్

- వైసీపీ హయాంలో చెలరేగిన సీఐ రాంబాబు
- దంపతుల విషయంలో అతిగా స్పందించిన సీఐ బిలాలుద్దీన్
- ఆయనతో వెళ్లి చేతులు కాల్చుకున్న మరో ఇద్దరు కానిస్టేబుళ్లు

గుంటూరు, సెప్టెంబరు 26: మరో ఇద్దరు సీఐలపై వేటుపడింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారం చెలరేగిన ఖాకీలు తాజాగా మూల్యం చెల్లించుకుంటున్నారు. గతంలో పొన్నూరు రూరల్‌లో పని చేసి ప్రస్తుతం సత్తెనపల్లి రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఎం రాంబాబు, డీసీఆర్బీ సీఐ బిలాలుద్దీన్‌తోపాటు డీసీఆర్బీ కానిస్టేబుళ్లు షేక్ చాంద్‌బాషా, షేక్ నూరుల్లాలను సస్పెండ్ చేస్తూ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గాడితప్పిన ఖాకీలపై పోలీసు ఉన్నతాధికారులు గడిచిన రెండు, మూడు నెలలుగా కొరడా ఝుళిపిస్తున్నారు. పట్టాభిపురం సీఐ విజయ్‌చంద్ర, తెనాలి టూటౌన్ సీఐ సుధాకర్‌లపై ఇప్పటికే వేటు పడింది. తాజాగా ఆ జాబితాలో మరో ఇద్దరు చేరారు. వైసీపీ హయాంలో పొన్నూరు రూరల్ సర్కిల్ పరిధిలో ఓ యువకుడు తనను ప్రేమపేరుతో మోసం చేశాడని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ కేసులో సీఐ రాంబాబు జోక్యం చేసుకుని యువతిని మోసం చేసిన యువకుడ్ని వదిలేశాడు. దీంతో బాధితురాలు స్టేషన్ వద్ద గొడవతో ఈ వ్యవహారం వివాదాస్పదమవడంతో గత్యంతరం లేక సీఐ నిందితుడ్ని తిరిగి అరెస్టు చేశారు. చేబ్రోలు పరిధిలోని క్వారీల యజమానులు, లారీ యజమానుల నుంచి, నారాకోడూరు పరిధిలోని హోటళ్ల నుంచి సీఐ పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. వీటిపై అప్పట్లోనే డీఎస్పీ స్థాయి అధికారి విచారణ జరిపి ఐజీకి నివేదిక పంపగా దాని ఆధారంగా రాంబాబుపై వేటు పడింది.

భర్తను కిడ్నాప్ చేసిన సీఐ, కానిస్టేబుల్

మనస్పర్థలతో భర్తతో విడిపోయిన ఓ మహిళ గుంటూరు హౌసింగ్ బోర్డు సమీపంలోని పుట్టింటికి వచ్చింది. అయితే భర్త అక్కడికి వచ్చి భార్యతో గొడవ పడుతున్నట్లు, అత్తమామలు తమకు బంధువైన డీసీఆర్బీ సీఐ బిలాలుద్దీన్‌కు ఫోన్ చేసి చెప్పారు. స్థానిక నల్లపాడు పోలీసులకు తెలియజేసి వారి ద్వారా చర్యలు తీసుకోవాల్సి ఉండగా, అందుకు భిన్నంగా తన వాహనంలో డీసీఆర్బీ కానిస్టేబుళ్లతో సంఘటనా స్థలానికి వెళ్లి భర్తను తన వాహనంలో ఎక్కించుకుని బెదిరించి ఆర్టీసీ బస్టాండ్ వద్ద వదిలేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలతో బాధితుడు నేరుగా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్పీ సతీష్‌కుమార్ విచారణకు ఆదేశించగా విచారణలో బాధితుడి ఆరోపణలు వాస్తవమేనని తేలాయి. సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు చట్ట విరుద్ధంగా వ్యవహరించారని తేలడంతో వారు ముగ్గురుని సస్పెండ్ చేస్తూ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

రైతులకు ఆమోదయోగ్యమైన
పరిహారం

- నకరికల్లు సమావేశంలో జేసీ సూరజ్‌ఘనోరే



నకరికల్లులో రైతులతో మాట్లాడుతున్న జేసీ సూరజ్ ఘనోరే

నకరికల్లు, సెప్టెంబరు 26: ఓడరేవు, పొందుగుల 167ఏ జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు ఆమోద యోగ్యమైన పరిహారం అందించేందుకు కృషి చేస్తున్నట్లు జేసీ సూరజ్‌ఘనోరే తెలిపారు. 167ఏ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూసేకరణకు సంబంధించి భూములు కోల్పోయిన రైతుల హక్కు పత్రాలను గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వారి నుంచి సేకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రహదారి విస్తరణలో ఎకరం రూ.12 లక్షల రిజిస్ట్రేషన్ విలువైన భూములకు రూ.31.60 లక్షలు, రూ.4.77 లక్షల రిజిస్ట్రేషన్ విలువ కలిగిన భూములకు రూ.12.59 లక్షలను రైతులకు పరిహారం ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఇంటి స్థలాలకు సంబంధించి సెంటుకు రూ.2.83 లక్షలు పరిహారం అందించాలని నిర్ధారించినట్లు తెలిపారు. రూపెనగుంట్ల, దేచవరం గ్రామాలకు చెందిన 56 మంది రైతులకు సంబంధించి 4.62 ఎకరాలకు నష్ట పరిహారం ప్రభుత్వం అందించనున్నది. చల్లగుండ్ల గ్రామ రెవెన్యూ పరిధిలో 117 మంది 57.28 ఎకరాలు భూమిని కోల్పోనున్నారు. మొత్తంగా 173 మంది రైతులకు సంబంధించి 68.90 ఎకరాలకు భూసేకరణ ప్రక్రియ జరగనున్నది. మార్కెట్ రేటు ప్రకారం తమకు పరిహారం అందించే దిశగా చర్యలు తీసుకోవాలని జేసీని రైతులు కోరారు. రైతుల అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని జేసీ హామీ ఇచ్చారు. అభ్యంతరాలు తెలిపిన ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని జేసీ రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దారు పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

10 మంది అరెస్టు

- రూ.20 లక్షల సొత్తు స్వాధీనం

చిలకలూరిపేట, సెప్టెంబరు 26: చిలకలూరిపేట రూరల్ పోలీస్ సర్కిల్ పరిధిలో జరిగిన రెండు వేర్వేరు దొంగతనాల కేసుల్లో 10 మందిని అరెస్టు చేసి రూ.20 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు. చిలకలూరిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలను తెలిపారు. ఓ కేసులో చోరీ చేసిన రెండు కార్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఐ సుబ్బానాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఊసా మణికంఠ (చిలకలూరిపేట), అన్నపు రెడ్డి కార్తీక్(చిలకలూరిపేట), పిల్లి కిరణ్ కుమార్(సామర్లకోట మండలం)లను అరెస్టు చేశామన్నారు. బొర్రా ప్రీతం(సామర్లకోట మండలం) అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు చెప్పారు. మరో కేసులో నాదెండ్ల, యడ్లపాడు మండలాల పరిధిలోని పొలాలు, ఎత్తిపోతల పథకాల వద్ద దొంగిలించిన రూ.5.50 లక్షల విలువ చేసే విద్యుత్ మోటారు, కాపర్, కేబుల్ వైరు, నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో కోటప్పకొండకు చెందిన నల్లబోతుల సామేలు, పాకనాటి శివలక్ష్మయ్య, పాకనాటి గోపితో పాటు బండారు గోపి (వంకాయలపాడు), రాసమంటి శ్రీనివాసరావు (యడ్లపాడు), నాగబోయిన శ్రీనివాసరావు (మైదవోలు), గుంజి ప్రేమ్ కుమార్ (కోటప్పకొండ) ఉన్నారు. సమావేశంలో చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, రూరల్ ఎస్‌ఐ జీ అనిల్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.



చిలకలూరిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసుల వివరాలు వెల్లడిస్తున్న నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, పక్కనే రూరల్ సీఐ సుబ్బనాయుడు

తగ్గించేదిలేదు

- మెట్టు దిగని వంటనూనెల వ్యాపారులు
- అధికారులు ఆదేశించినా ఎమ్మార్పీ ఆధారంగా దోపిడీ
- చర్యలు తీసుకోలేకపోతున్న రెవెన్యూ, పౌరసరఫరాల శాఖలు

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'వంటనూనెల దిగుమతిపై కేంద్ర ప్రభుత్వం పెంచిన దిగుమతి సుంకం గతంలో దిగుమతి చేసుకున్న నూనెలకు వర్తించదు. అయినా వ్యాపారులు నూనెల ధరలు అమాంతం పెంచేశారు. పాత స్టాకుపై కూడా ధరలు పెంచి విక్రయించడం నేరం. స్టాక్ ఉండి కూడా లేనట్లుగా కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటాం..' అని అధికారులు వంట నూనెల వ్యాపారులను హెచ్చరించారు. అయితే అధికారుల ఆదేశాలను జిల్లాలోని వంట నూనెల వ్యాపారులు పెడచెవిన పెడుతున్నారు. అటు వ్యాపారులు, ఇటు మాల్స్, సూపర్‌మార్కెట్ల నిర్వాహకులు వంట నూనె ధరల విషయంలో ఒక్క మెట్టు కూడా దిగలేదు. ఒక్కో ఆయిల్ ప్యాకెట్‌పై రూ.20 పెంచిన ధరనే వినియోగదారుల వద్ద వసూలు చేస్తున్నారు. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే ఎమ్మార్పీ కంటే తక్కువగా ఇస్తున్నామని సమాధానాలు చెబుతున్నారు. అంతేకాకుండా చాలా బ్రాండ్స్ ఆయిల్స్‌ని దాచేసి రెండు, మూడు రకాల ప్యాకెట్లను మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు.

వ్యాపారుల సిండికేట్..

ముడి చమురుపై కస్టమ్స్ సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం పెంచిందే తడవుగా ఈ నెల 14 నుంచి వంట నూనెలు విక్రయించే వ్యాపారులు సిండికేట్ అయిపోయారు. ఒకపక్క కేంద్రం కొత్తగా దిగుమతి చేసుకునే క్రూడ్ ఆయిల్ పైనే ఈ పెంచిన సుంకం అమలు చేయాలని చెబుతున్నప్పటికీ పాత స్టాకుపై ఇక్కడి వ్యాపారులు అమలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. అప్పటివరకు బ్రాండ్‌ని బట్టి రూ.100 నుంచి రూ.110 మధ్య ఉన్న సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటర్ ప్యాకెట్‌ని రూ.120 నుంచి రూ.130కి పెంచేశారు. అలానే రైస్‌బ్రాన్ ఆయిల్‌ని రూ.130 చేశారు. పామాయిల్, సోయాబీన్ ఆయిల్స్‌ని కూడా లీటర్‌కి రూ.20 చొప్పున పెంచారు. వంటనూనె నిత్యావసర సరుకు కావడంతో గత్యంతం లేని పరిస్థితుల్లో పెంచిన ధరలను చెల్లించి వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. ధరల పెంపుపై జిల్లా అధికారులు ఇటీవల ఆయిల్స్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి పాత స్టాకుపై రేటు పెంచడానికి వీల్లేదని సూచించారు. పాత ధరలకే విక్రయించడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అయితే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో ఇందుకు ఏ ఒక్క వ్యాపారి ముందుకు రాలేదు. నేటికీ పెంచిన ధరలనే అమలు చేస్తున్నారు. వంటనూనె ప్యాకెట్లపై విపరీతమైన ఎమ్మార్పీ ఉంటుంది. గతంలో రూ.100కి విక్రయించిన ప్యాకెట్‌పై ఎమ్మార్పీ రూ.160 వరకు ఉంటుంది. ఇప్పుడు దానిని సొమ్ము చేసుకుంటూ ఇంకా మేము ఎమ్మార్పీ కంటే తక్కువకే విక్రయిస్తున్నామని వ్యాపారులు బుకాయిస్తున్నారు. ఈ ఎమ్మార్పీ మాయాజాలాన్ని అటు తూనికలు, కొలతలు, ఇటు రెవెన్యూ అధికారులు అరికట్టలేకపోతున్నారు.



నవ్య | చిత్రజ్యోతి
గుంటూరు • శుక్రవారం 27 సెప్టెంబరు 2024
cinema@andhrajyothy.com

ఆ సన్నివేశాలు తొలగిస్తే ఓకే

• హైకోర్టుకు తెలిపిన సెన్సార్ బోర్డు



తాము సూచించిన సన్నివేశాలకు కత్తెర వేస్తే 'ఎమర్జెన్సీ' చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇస్తామని సెన్సార్ బోర్డు బాంబే హైకోర్టుకు తెలిపింది. కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో పలుమార్లు విడుదల వాయిదా పడింది. దీంతో ఆమె బాంబే హైకోర్టును ఆశ్రయించగా, సర్టిఫికెట్ జారీ చేసే విషయంలో ఈ నెల 25లోగా ఓ నిర్ణయం తీసుకోవాలని సెన్సార్ బోర్డ్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ కేసు గురువారం విచారణకు రాగా, కొన్ని సన్నివేశాల్లో కట్స్‌ను సూచించిన సెన్సార్‌బోర్డ్ అందుకు అంగీకరిస్తే సెన్సార్ సర్టిఫికెట్ ఇస్తామని కోర్టుకు నివేదించింది. దీనిపై నిర్ణయం తీసుకోవడానికి చిత్రబృందం సమయం కోరింది. దీంతో కోర్టు తదుపరి విచారణను ఈ నెల 30కు వాయిదా వేసింది. ఆ లోగా ఓ నిర్ణయానికి రావాలని నిర్మాణసంస్థను ఆదేశించింది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవితం, ఎమర్జెన్సీ నాటి సంఘటనల నేపథ్యంలో 'ఎమర్జెన్సీ' తెరకెక్కింది. కంగన ఇందిరాగాంధీ పాత్రను పోషించడంతో పాటు స్వీయ దర్శకత్వంలో నిర్మించారు.

జస్ట్ ఆస్కింగ్.. అంటూ ట్వీట్ల మీద ట్వీట్లు



విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటారు. వివిధ అంశాలపై స్పందిస్తూ 'జస్ట్ ఆస్కింగ్' అంటూ ప్రశ్నలు సంధిస్తుంటారు. తిరుమల లడ్డు వివాదంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, ప్రకాశ్‌రాజ్‌కు మధ్య మూడు రోజుల క్రితం మొదలైన ట్వీట్ యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రకాశ్‌రాజ్ పోస్టులపై పవన్‌కల్యాణ్ అసహనం వ్యక్తం చేయడమే కాకుండా సనాతన ధర్మంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని మీడియా సమావేశంలో హెచ్చరించడంతో ఈ ట్వీట్ల అటాక్ మొదలైంది. 'నేను విదేశాల్లో ఉన్నా.. ఇండియా వచ్చిన తర్వాత మీ ప్రశ్నలకు సమాధానం చెబుతా' అని ప్రకాశ్‌రాజ్ ట్వీట్ చేశారు. అంతటితో ఈ వ్యవహారం ముగిసిందని అందరూ భావించారు. కానీ ప్రకాశ్‌రాజ్ ఊరుకోలేదు. తమిళ హీరో కార్తీ లడ్డు వ్యవహారంపై క్షమాపణ చెప్పడాన్ని ప్రస్తావిస్తూ 'చేయని తప్పునకు క్షమాపణలు చెప్పించుకోవడంలో ఆనందం ఏమిటో.. జస్ట్ ఆస్కింగ్' అంటూనే వ్యంగ్య బాణం వదిలారు. అయితే ఈ ట్వీట్‌పై పవన్‌కల్యాణ్ స్పందించలేదు. ఆయన మౌనంగా ఉన్నా ఊరుకోకుండా గురువారం మరో ట్వీట్ బాణం వదిలారు ప్రకాశ్‌రాజ్. గెలిచే ముందు ఒక అవతారం.. గెలిచాక మరో అవతారం .. ఏమిటీ అవాంతరం.. ఎందుకీ అయోమయం.. ఏది నిజం.. జస్ట్ ఆస్కింగ్' అంటూ తనదైన శైలిలో ప్రశ్నించారు. ప్రకాశ్‌రాజ్ పెట్టిన ఈ ట్వీట్ పై నెటిజన్లు రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు.



ఉత్సవంలా సాగే పాట

శంకర్

రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. కియారా అద్వానీ కథానాయిక. దిల్‌రాజు-శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి రెండో గీతాన్ని ఈ నెల 30న విడుదల చేయనున్నారు. గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శంకర్, సంగీత దర్శకుడు తమన్ ఈ పాట చిత్రీకరణకు సంబంధించిన విశేషాలను పంచుకున్నారు. శంకర్ మాట్లాడుతూ 'ఈ పాట చిత్రీకరణ కోసం చాలా పరిశోధన చేశాం. దేశంలోని భిన్న ప్రాంతాలకు చెందిన నృత్యరీతులను పాటలో భాగం చేశాం. ఒక ఉత్సవంలా ఈ పాట సాగుతుంది. రామ్‌చరణ్ అద్భుతంగా నర్తించారు' అని చెప్పారు. తమన్ మాట్లాడుతూ "రా మచ్చా.. పాటలో విభిన్న సంస్కృతులను చూపించబోతున్నాం. పాటను తెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు' అని తెలిపారు.



టాలీవుడ్ అగ్ర దర్శకులు రాజమౌళి, సుకుమార్ అనూహ్య కలయిక అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు స్టూడియోలో 'పుష్ప2' చిత్రీకరణ జరుగుతోంది. మహేశ్‌బాబుతో తాను చేయబోయే సినిమా పనుల కోసం రాజమౌళి కూడా అదే స్టూడియోకు వెళ్లారు. అక్కడ వారిద్దరు కలుసుకున్నారు.

ఆకట్టుకునే అలియా పోరాటం



బాలీవుడ్ హీరోయిన్ అలియాభట్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'జిగ్రా'. వాసన్ బాలా దర్శకత్వంలో కరణ్ జోహార్ నిర్మించారు. అలియాభట్ సోదరుడి పాత్రలో వేదాంగ్ రైనా నటించాడు. అక్టోబర్ 11న విడుదలవుతోంది. చిత్రబృందం గురువారం ట్రైలర్‌ను విడుదల చేసింది. హంతక ముఠాల నుంచి తమ్ముణ్ణి కాపాడుకునేందుకు అక్క చేసిన పోరాటం నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. యాక్షన్ సన్నివేశాల్లో అలియా నటన ఆకట్టుకుంది.

మనసుకి హత్తుకొనే తల్లి కథ



సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య ఆశీస్సులతో ఆయన తనయుడు కిశోర్ చిత్రనిర్మాణరంగంలోకి అడుగుపెట్టి నిర్మిస్తున్న 'తల్లి మనసు' చిత్ర షూటింగ్ పార్ట్ పూర్తయింది. రచిత మహాలక్ష్మీ, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన తారాగణం. ఈ సినిమాతో వి.శ్రీనివాస్ (సిప్పి) దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సందర్భంగా నిర్మాత ముత్యాల కిశోర్ మాట్లాడుతూ 'సినిమా ప్రారంభోత్సవం నాడు సింగిల్ షెడ్యూల్‌లో చిత్రాన్ని పూర్తి చేస్తామని చెప్పినట్టే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఏకధాటిగా షూటింగ్ చేసి వర్క్ పూర్తి చేశాం. మంచి కథ, కథనాలు సినిమాకు ప్రధాన బలం. అందుకు తగ్గ ఆర్టిస్టులు దొరికారు. వారందరి సహకారంతో మనసు కట్టి పడేసే అద్భుత చిత్రంగా రూపుదిద్దుకుంది. నాన్నగారి పర్యవేక్షణలో దర్శకుడు చక్కగా సినిమా తీశారు. తొలి ప్రయత్నంలోనే ఒక మంచి సినిమా తీసినందుకు ఆనందంగా ఉంది' అన్నారు. వాస్తవిక జీవితానికి అద్దం పట్టే విధంగా 'తల్లి మనసు' ఉంటుందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని ముత్యాల సుబ్బయ్య చెప్పారు.



యాభై సెకన్ల యాడ్‌కు రూ. ఐదు కోట్లా!?

కాలం కలసి రావాలే కానీ సినిమా తారలకు ఇప్పుడు రెండు చేతులా సంపాదనే!. అయితే సినిమా షూటింగ్ లేకపోతే యాడ్ షూటింగ్ అన్నట్లుగా ఉంది కొంతమంది తారల బిజీ షెడ్యూల్. రెండు చోట్లా మంచి డబ్బు వస్తుండడంతో మరింత హుషారుగా పని చేస్తున్నారు. ఒక సినిమా కోసం మూడు, నాలుగు నెలలు కష్టపడితే వచ్చే పారితోషికం కంటే ఒక నిముషం పాటు కనిపించే యాడ్ ఫిల్మ్ సంపాదనే ఎక్కువగా ఉండడంతో తెలుగులోనూ చాలా మంది తారలు ఇప్పుడు యాడ్ ఫిల్మ్‌లో నటించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. అందరి కంటే ఒక అడుగు ముందుకు వేసి యాభై సెకన్ల యాడ్ ఫిల్మ్‌లో నటించినందుకు అక్షరాలా రూ. ఐదు కోట్లు వసూలు చేసి వార్తల్లో నిలిచారు నయనతార. ఇంతకుముందు నయనతార పారితోషికం రూ. ఐదు కోట్లే ఉండేది. కానీ హిందీ చిత్రం 'జవాన్' సూపర్ హిట్ అయిన తర్వాత అమాంతం తన పారితోషికాన్ని పది కోట్ల రూపాయలకు నయనతార పెంచేసిందని నిర్మాతలు చెబుతున్నారు. అంటే సౌత్‌లో నే అత్యధిక పారితోషికం తీసుకొనే హీరోయిన్ నయనతారే అన్నమాట. ఇప్పుడు యాడ్ ఫిల్మ్‌తోనూ ఆమె మోత మోగిస్తోంది. ప్రస్తుతం నయనతార తన భర్త విఘ్నేశ్, కవల పిల్లలతో గ్రీస్‌లో జాలీగా విహరిస్తోంది.

అక్టోబర్‌లో గ్యాంగ్‌స్టర్



మాఫియా ముఠాల మధ్య ఆధిపత్య పోరును సరికొత్తగా వెండితెరపై ఆవిష్కరించిన పలు చిత్రాలు విజయం అందుకున్నాయి. ఇప్పుడు ఇదే తరహా కథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. చంద్రశేఖర్ రాథోడ్, కాశ్వీ కాంచన్ జంటగా నటిస్తున్నారు. చంద్రశేఖర్ రాథోడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. అక్టోబర్ 25న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం గురువారం ప్రకటించింది. ఈ సందర్భంగా రచయిత సాయిమాధవ్ బుర్రా చేతుల మీదుగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ప్రేక్షకలను ఆకట్టుకునేలా ఉంటుందనీ, కథలోని మలుపులు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయని చంద్రశేఖర్ రాథోడ్ తెలిపారు.

అప్‌డేట్స్

మా మనవడినీ ఆదరించండి

- పరుచూరి బ్రదర్స్



సుదర్శన్ పరుచూరి హీరోగా పరిచమయవుతున్న 'మిస్టర్ సెలబ్రిటీ' చిత్రం అక్టోబర్ 4న విడుదల కానుంది. రవికిశోర్ దర్శకత్వంలో చిన్న రెడ్డయ్య, ఎన్. పాండురంగారావు నిర్మించారు. వరలక్ష్మి శరత్‌కుమార్, నాజర్, రఘుబాబు ఇతర ముఖ్య పాత్రధారులు. ఈ సినిమా రిలీజ్ పోస్టర్‌ను పరుచూరి గోపాలకృష్ణ విడుదల చేసి 'మమ్మల్ని ఆదరించినట్లుగానే మా మనవడు సుదర్శన్‌ను ఆదరించాలని కోరుతున్నా. కొత్త దర్శకుడైనా రవికిశోర్ సినిమా బాగా తీశాడు' అని అభినందించారు. పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 'మమ్మల్ని నలభై ఏళ్లుగా ఆదరిస్తున్నారు. మా మనవడు సుదర్శన్ 'మిస్టర్ సెలబ్రిటీ' హీరోగా మీ ముందుకు వస్తున్నాడు. తనని ఆశీర్వదించి, సినిమాను హిట్ చేయండి' అని కోరారు.

మాస్ లుక్‌తో



యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల లీడ్‌రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'పొట్టేల్'. దసరాకు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. నటుడు అజయ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఆయన లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. మాస్ లుక్‌లో పవర్‌ఫుల్‌గా కనిపించారు అజయ్. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో నిశాంక్‌రెడ్డి కె, సురేశ్ కుమార్ సడిగె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీతం: శేఖర్ చంద్ర, సినిమాటోగ్రఫీ: మోనిష్ భూపతి రాజు



ఆంధ్ర వర్సిటీలో పీజీ, పీజీ డిప్లొమా



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి సెల్ఫ్ సపోర్టెడ్ కోర్సులు. ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంస్థ సహకారంతో ఈ కోర్సులను నిర్వహిస్తున్నారు. అకడమిక్ మెరిట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో మొత్తం 40 సీట్లు ఉన్నాయి. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ ఫీజు ఏడాదికి రూ.55,000.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో క్రిటికల్ కేర్ టెక్నాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు 15 చొప్పున మొత్తం 45 సీట్లు ఉన్నాయి. గ్యాస్ట్రోఎంటరాలజీ టెక్నాలజీ స్పెషలైజేషన్ ఎంచుకున్నవారికి ప్రోగ్రామ్ ఫీజు రూ.40,000. మిగిలిన స్పెషలైజేషన్‌లకు ప్రోగ్రామ్ ఫీజు రూ.60,000.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎంబీబీఎస్/బీడీఎస్/బీఫార్మసీ/బీఎస్సీ/బీఎస్సీ నర్సింగ్/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.200
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **వయసు:** దరఖాస్తు నాటికి 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- **అడ్మిషన్ కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 16
- **క్యాంపస్:** బొల్లినేని మెడ్‌స్కిల్స్ కిమ్స్-ఐకాన్ హాస్పిటల్ క్యాంపస్, షీలానగర్, విశాఖపట్నం-532003
- **చిరునామా:** డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగర్ ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం - 530003
- **వెబ్‌సైట్:** www.audoa.andhrauniversity.edu.in

దిక్సూచి


ఐఐఎఫ్‌టీలో
పీజీ సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్(ఇంటర్నేషనల్ బిజినెస్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి ఏడాది. ఇది వీకెండ్ ఆన్ క్యాంపస్ ప్రోగ్రామ్. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో మూడు ట్రైమెస్టర్లు ఉంటాయి. ప్రతి ట్రైమెస్టర్ ప్రారంభంలో మూడు రోజులు కాంటాక్ట్ వీక్ నిర్వహిస్తారు. రెండో ట్రైమెస్టర్‌లో పోర్ట్ విజిట్ ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాలవారికి 45 శాతం మార్కులు చాలు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్ అనుకూలంగా ఉంటుంది.

- దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 5
- వెబ్‌సైట్: www.iift.ac.in



సీఎం సహాయనిధికి రూ.2 లక్షల విరాళం


సీఎం చంద్రబాబునాయుడుకు చెక్కును అందజేస్తున్న మారెళ్ళ రామకృష్ణ, రమణ

యడ్లపాడు, సెప్టెంబరు 26 : యడ్లపాడు మండలం లింగారావు పాలెం గ్రామానికి చెందిన సోదరులు మారెళ్ళ రామకృష్ణ, మారెళ్ళ రమణలు ఏపీ సీఎం సహాయనిధికి రూ.2 లక్షలు విరాళాన్ని అందించారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో గురువారం సోదరులు చంద్రబాబును కలసి చెక్కును అందజేశారు. చిలకలూరిపేట శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు పిలుపు మేరకు వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాన్ని అందించినట్లు సోదరులు పేర్కొన్నారు.

రాజధాని నిర్మాణానికి రూ.2 లక్షలు


ముఖ్యమంత్రికి విరాళం చెక్కును అందిస్తున్న సత్యనారాయణ, నగరాజకుమారి

తెనాలిరూరల్, సెప్టెంబరు 26: రాజధాని అమరావతి పునఃనిర్మాణానికి గానూ సీఎం సహాయనిధికి రూ.2లక్షల విరాళాన్ని అందించారు. పెదరావూరుకి చెందిన రైతు గిరజవోలు సత్యనారాయణ, నగరాజ కుమారిలు గురువారం సీఎం చంద్రబాబునాయుడిని కలిసి తమ వంతు విరాళపు చెక్కును అందజేశారు. విరాళం అందజేసిన వారిని చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా అభినందించారు.


పిల్లి మాణిక్యరావు, దామచర్ల సత్యలను సత్కరిస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు

కష్టపడి పని చేసే వారికి టీడీపీలో గుర్తింపు: ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, సెప్టెం బరు 26 : కష్టపడి పని చేసే వారికి తెలుగు దేశం పార్టీలో ఎప్పుడు మంచి గుర్తింపు ఉంటుందని మాజీ మంత్రి, చిలక లూరిపేట ఎమ్మెల్యే ప్రత్తి పాటి పుల్లారావు అన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం భర్తీ చేసిన నామినేటెడ్ పదవులే ఇందుకు నిదర్శనం అని అన్నారు. లెదర్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పిల్లి మాణిక్యరావు, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్‌గా ఎంపికైన దామచర్ల సత్యనారాయణ గురువారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరిని శాలువాతో సత్క రించి వారికి ప్రత్తిపాటి అభినందనలు తెలిపారు. పదవులు రానివారు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, త్వరలోనే మరిన్ని నామినేటెడ్ పోస్టుల భర్తీ ఉంటుందని సీఎం చెప్పిన విషయాన్ని ప్రత్తిపాటి గుర్తుచేశారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ప్రత్తిపాటి తల్లి చిన నారాయ ణమ్మ చిత్రపటం వద్ద మాణిక్యరావు, సత్య నారాయణలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు ఉద్యమించాలి

- 1,2,3 తేదీలలో రిలే నిరాహార దీక్షలు
- ప్రజా, కార్మిక సంఘాల నాయకులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 26: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం దశల వారి ఆందోళనలు నిర్వహిస్తున్నట్టు ప్రజా, కార్మిక సంఘాల నాయకులు స్పష్టం చేశారు. విశాఖ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్థానిక కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో ఏఐటీయూసీసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షణలో భాగంగా అక్టోబరు 1,2,3 తేదీలలో జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఏఐటీయూసీసీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వరుసగా ఆకిటి అరుణ్ కుమార్, దండా లక్ష్మీనారాయణ ,ఏఐటీయూసి రాష్ట్ర గౌరవాధ్య క్షుడు వెలుగూరి రాధా కృష్ణమూర్తి, నల్లమడ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొల్లా రాజ మోహన్, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి కే.అజయ్ కుమార్ పాల్గొన్నారు.

సంక్షోభాన్ని సవాల్‌గా స్వీకరించిన సీఎం

- పది రోజుల్లోనే బాధితులకు పరిహారం
- విజన్ 2047 దిశగా ముందడుగులు
- ఎమ్మెల్యే ఆనందబాబు


అనంతవరంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, సెప్టెంబరు 26 : సంక్షోభాన్ని సవాల్‌గా తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రమిస్తున్నారని, విపత్తునకు కుంగిపోకుండా అధికారులను అప్రమత్తం చేసి వరద సహాయక చర్యల్లో స్వయంగా పాల్గొన్న ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోతారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల పరిధిలోని అనంతవరంలో గురువారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం'లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించి ప్రజలకు కరపత్రాలు అందించి ప్రభుత్వ పని తీరు గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజావేదికపై ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో గత ప్రభుత్వంలో ఐదేళ్ల సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టే నాటికి రాష్ట్రానికి రూ.11 లక్షల కోట్లు అప్పులు మిగిల్చారన్నారు. సంక్షోభాన్ని అధిగమించి సంక్షేమ, అభివృద్ధిని 100 రోజుల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. వర్షాలు, వరదలు వచ్చినా కుంగిపోకుండా అధికారులను అప్రమత్తం చేసి విపత్తు సమర్థవంతంగా ముఖ్యమంత్రి ఎదుర్కొన్నారన్నారు. వరద పరిస్థితులను పది రోజుల్లోనే చక్కదిద్దడంతో పాటు మరో పది రోజుల్లోనే బాధితులందరికి పరిహారాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. భవిష్యత్ తరాల యువతను దృష్టిలో పెట్టుకుని విజన్-2047 దిశగా ముందుకు అడుగులు వేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారధ్యంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా పనిచేస్తుందని చెప్పారు. జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శ్రీనివాసరావు ఎమ్మె ల్యేను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి వైపిచ్చిరెడ్డి, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్, మండల టీడీపీ అధ్యక్షులు ఘైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కే.మధుసూదనప్రసాద్, టీడీపీ రాష్ట్రకార్యదర్శి టీ. సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలని అపవిత్రం చేసిన వైసీపీ

టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు ధారూ నాయక్

గుంటూరు, సెప్టెంబరు 26 : పవిత్రమైన తిరుమలని వైసీపీ అపవిత్రం చేసిందని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎం.ధారూ నాయక్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ పెద్దలు తిరుమలను ఒక పుణ్యక్షేత్రంగా కాకుండా సొంత సామ్రాజ్యంలా భావించారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో లడ్డూపై అనేక ఫిర్యాదులు వెల్లువెత్తాయని, అప్పటి వైసీపీ ప్రభుత్వ పెద్దలకు గానీ, టీటీడీ పాలక మండలికి గానీ, జగన్‌కు ఆత్మబంధువైన అప్పటి ఈఓ ధర్మారెడ్డికి గానీ అవేమీ చెవికెక్కలేదని విమర్శించారు. లడ్డూలు, ఇతర ప్రసాదాల తయారీలో వాడుతోంది కల్తీ నెయ్యి అని తెలిసి కూడా కొనుగోలు చేయడం దుర్మార్గం అన్నారు. సాక్షాత్తు గోవిందుడికే ఘోర అపచారం తలపెట్టినవారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న జనసేన నేతల ప్రాయశ్చిత్త దీక్షలు

గుంటూరు, సెప్టెంబరు 26: తిరుమలలో లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు వినియోగించిన కారణంగా ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, నేతలు మామిడి రాము, ఉగ్గిరాల సీతారామయ్య, దాసరి రాము తదితరులు హౌసింగ్ బోర్డు కాలనీలోని సాయిబాబా గుడిలో గురువారం ప్రాయశ్చిత దీక్ష నిర్వహించారు. పార్టీ నాయకులతో పాటు వీరమహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. గాదె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం తిరుమల తిరుపతిని ఆదాయ వనరుగా మార్చుకొని ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరించిందని విమర్శించారు. బోనబోయిన మాటాడుతూ పవన్ కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా వస్తున్న ఆదరణ చూసి వైసీపీ నాయకులు తట్టుకోలేకపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నేతలు పీ.నరసింహరావు, డీ.వెంకటేశ్వరరావు, డీ.లక్ష్మీదుర్గ, వై. పద్మావతి, భూషయ్య, డీ.సీతారామయ్య, కే. వెంకటేశ్వరరావు, ఎం.కళ్యాణ్, ఎ.బుజ్జి, టీ.నాగేశ్వరరావు, న్యాయవాది మాధవరావు, శివం రఘు, కే.శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

అండర్ - 14, అండర్ - 17, అండర్ - 19

రగ్బీ, సెపక్ తక్రా బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక


రగ్బీకి ఎంపికైన అండర్-19 జిల్లా బాలబాలికల జట్టు

సత్తెనపల్లిరూరల్, సెప్టెంబరు 26 : మండలంలోని నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని స్కూల్ గేమ్స్ అండర్ - 14, అండర్ - 17, అండర్ - 19 బాల బాలికల సెపక్ తక్రా, అండర్ - 19 రగ్బీ బాల బాలికల జిల్లా జట్ల ఎంపికలు జరిగాయి. జట్ల ఎంపికలకు వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి 250 మంది క్రీడాకారులు హాజరైనట్టు అండర్ - 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి నరసింహారావు తెలిపారు.

ఎంపికల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డెంపూడి పవన్ కుమార్ హాజరయ్యారు. క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు తమ జట్టు విజయమే ధ్యేయంగా రాణించాలని, క్రీడల ద్వారా జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకు రావాలని కోరారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు కొన్ని రోజుల్లో జరగబోయే 68వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. స్కూల్ గేమ్స్ సహాయ కార్యదర్శి పద్మాకరరావు, హెచ్ఎం, పీఈటీలు పాల్గొన్నారు.

ఎంపికైన జట్ల వివరాలు..

అండర్ - 19 బాలుర రగ్బీ జిల్లా జట్టుకు పవన్ కుమార్, పీ.వవన కృష్ణ, ఈ.ప్రదీప్, జీ.మనోజ్‌కుమార్, ఎం.నాగరాజు, ఎస్‌కే జాస్వీర్, పీ.సాయి గణేష్, కే.దుర్గాప్రసాదు, కే.భాను, షేక్ రియాజ్, షేక్ మహమ్మద్ రియాజ్, ఫణీంద్ర, పీ.శ్రీకాంత్, ఎన్.రవితేజ. అండర్ - 19 బాలికల రగ్బీ జిల్లా జట్టుకు రోజ్‌మేరీ, శ్రీలక్ష్మి, ప్రవల్లిక, పుష్పలత, కోమలి, అలేఖ్య, జస్మ ఫర్వీన్, నాగమణి, సౌమ్య, త్రివేని, దేవి, నల్మ, కే.ప్రవల్లిక, బీ.అఖిల, జీ.సుచరిత. అండర్ - 14 బాలుర జిల్లా సెపక్ తక్రా జట్టుకు ఎం.మనోహర్, ఆర్.సంతోష్ కుమార్, టీ.మనోహర్‌బాబు, షేక్ మహమ్మద్ తౌషిప్, బీ.కార్తీక్. అండర్ - 14 బాలికల సెపక్ తక్రా జిల్లా జట్టుకు పీ.గాయత్రి, కే.గీతిక, డీ.అక్షయ, ఎం.హర్షిణి, బీ.ప్రగతి, అండర్ - 17 బాలుర సెపక్ తక్రా జిల్లా జట్టుకు పీ.శౌరి కిరణ్, పీ.గోపీచంద్, బీ.అనిల్‌కుమార్, ఎం.ప్రభుదాసు, ఎం.లోకేశ్ ఎంపికయ్యారు. అండర్ - 17 బాలికల సెపక్ తక్రా జిల్లా జట్టుకు ఎం.నాగలక్ష్మి, ఏ.మానస, కే.కీర్తన, బీ.మోక్షసాధని, బీ.సాత్విక. అండర్ - 19 బాలుర సెపక్ తక్రా జిల్లా జట్టుకు కే.శ్రీనాధ్, జీ.హర్ష, వై.ప్రభుదాసు, కే.విజయ చోళుడు, బీ.నాని ఎంపికయ్యారు. అండర్ - 19 బాలికల సెపక్ తక్రా జిల్లా జట్టుకు పీ.యామిని, కే.బ్లెస్సీ, బీ.మౌనిక, వీ.భావనశ్రీ కుమారి, ఓ.దీవెన ఎంపికయ్యారు.

జలవనరుల శాఖలో బదిలీలు

- ఎస్ఈగా రమేష్ కల్లూరి
- విజయవాడ సీఈ కార్యాలయానికి ఉమామహేశ్వర రావు బదిలీ

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో ఎస్ఈ, ఈఈ స్థాయి అధికారుల బదిలీలు జరిగాయి. ఇరిగేషన్ సర్కిల్ గుంటూరు డివిజన్ ఉన్నతాధికారిగా రమేష్ కల్లూరిని ప్రభుత్వం నియమించింది. ప్రకాశం జిల్లాకు చెందిన ఆయన ప్రస్తుతం పాడేరు ఇరిగేషన్ సర్కిల్ ఎంఎఐ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. కాగా, గుంటూరుకు చెందిన ఉమామహేశ్వరరావుని విజయవాడ ఎస్ఈ హైడ్రాలజీ కార్యాలయంలో ఈఈ-1గా పోస్టింగ్ చేసింది. రేపల్లె డ్రైనేజీ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న పులిపాటి వెంకటరత్నంని కేడబ్ల్యూడీ తెనాలికి బదిలీ చేసింది. సంకరపు మల్లికార్జునని తెనాలి కేడబ్ల్యూడీ డివిజన్ నుంచి శ్రీశైలం డ్యాంకి బదిలీ చేసింది. బూసం శ్యాం ప్రసాద్‌ని కృష్ణా డెల్టా చీఫ్ ఇంజనీర్ కార్యాలయం నుంచి గుంటూరు ఎస్ఈ కార్యాలయంలో గేజింగ్ డివిజన్‌కు పోస్టింగ్ చేసింది. చింతలపూడి ఎల్ఐఎస్ ప్రాజెక్టు డివిజన్‌లో ఉన్న వంగల శివరాంప్రసాద్‌ని పులిచింతల ప్రాజెక్టు డివిజన్-4కి బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జీ.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు వెలువరించారు.

30న క్రీడాకారుల ఎంపిక

గుంటూరు(విద్య),సెప్టెంబరు 26 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి జిల్లా ఎంపిక నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి మెల్లెంపూడి రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 30న అథ్లెటిక్స్ పోటీలు అండర్-14 ,అండర్-17 బాల బాలికలకు పెనుమాకలో జడ్పీ స్కూల్‌లో, రెజ్లింగ్ అండర్-14, అండర్-17 బాల బాలికల విభాగం విద్యార్థులకు అచ్చంపేటలోని ఏపీ సోషల్ వెల్ఫేర్ స్కూల్, నిర్వహిస్తామని తెలిపారు. 30న బాస్కెట్‌బాల్ అండర్-14, అండర్-17 (బాలికలకు) నరసరావుపేటలోని మున్సిపల్ బాలికల ఉన్నత పాఠ శాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1న కోకో అండర్ -14 బాలబాలికల ఎంపి కలు కారంపూడిలోని బ్రహ్మనాయుడు జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని, ఇదేరోజున టైక్వాండో అండర్-14, అండర్-17 బాల బాలికలకు తెనాలిలోని జెఎస్ ఫిట్నెస్ సెంటర్‌లో ఎంపికలు జరుగుతాయని ,వివరాలకు 9963386100 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అక్టోబర్ 1న కరాటే పోటీలు బాలబాలికల అండర్-14, 17 విభాగాల ఎంపికలు కుంచనపల్లిలోని అరవింద హైస్కూల్‌లో జరుగుతాయని,వివరాలకు 95817 66907 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అండర్-14,17 విభాగాల్లో బాలబాలికల షూటింగ్ ఎంపికలు ఇండియన్ షూటింగ్ అకాడమీ గుంటూరు అమరావతి రోడ్డు(అలా ఆసుపత్రి ఎదురు) నిర్వహిస్తారని, వివరాలకు 9490639441 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

వీఐటీ గేటు ముందు ఏఐఎస్ఎఫ్ ధర్నా


ఏఐఎస్ఎఫ్ సభ్యులను అడ్డుకుంటున్న సెక్యూరిటీ సిబ్బంది

తుళ్లూరు, సెప్టెంబరు 26: వీఐటీ విశ్వవిద్యాలయంలో బీటెక్ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సాయి శ్రీయ (19) ఫ్యాన్‌కు ఉరేసుకొని ఈ నెల 17న సాయంత్రం 7 గంటల సమయంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో కళాశాల వీసీని మృతురాలు తల్లిదండ్రులతో మాట్లాడించాలని డిమాండ్ చేశారు. కళాశాల లోపలకు వెళ్లబోతుండగా వారిని సెక్యూరిటీ అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గేటు ముందు విద్యార్థి ఫెడరేషన్ ధర్నా నిర్వహించింది. ఆత్మహత్య వివరాలు తల్లిదండ్రులకు పూర్తిగా వివరించలేకపోవడం ఏంటని ప్రశ్నించారు. విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పోలీసుల సమక్షంలో ఆత్మహత్యకు గల కారణాలు, సీసీ పుటేజీలను చూపించి వివరాలను ఆమె తల్లిదండ్రులకు నాలుగు గంటల పాటు తెలిపామని వీఐటీ యాజమాన్యం చెబుతోంది. విద్యార్థిని కట్టిన ఫీజు రుసుం కూడా వెనక్కి ఇస్తామని చెప్పామని, అకౌంట్ నంబరు ఇవ్వాలని అప్పుడే అడిగామని పేర్కొంది. ఈ ఘటన జరిగిన వారంరోజుల తర్వాత ఆందోళనకు దిగడం బాధాకరమని వీఐటీ యాజమాన్యం తెలిపింది.

రోడ్లు, భవనాల శాఖతో ఎస్ఆర్ఎం ఎంవోయూ


ఒప్పంద పత్రాలను చూపుతున్న ఎస్ఆర్ఎం, రోడ్లు, భవనాల శాఖ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 26: ఏపీ రోడ్లు, భవనాల శాఖకు సమగ్ర సహకారాన్ని అందిం చేందుకు ఎస్ఆర్ఎం యూని వర్సిటీ ముందుకు వచ్చింది. ప్రభు త్వం చేపట్టే నాణ్యమైన రోడ్ల నిర్మాణం, నూతన టెక్నాలజీ అభివృద్ధి కోసం వర్క్‌షాపుల నిర్వహణ వంటి అంశాల్లో అవసరమైన సహకారాన్ని ఇచ్చేందుకు వర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం అంగీకరించింది. ఈ మేరకు రోడ్లు, భవనాల శాఖతో గురువారం ఎం వోయూ కుదు ర్చుకుంది. ఆ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ నయీముల్లా, స్టేట్ హైవేస్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి పాల్గొని ఎంవోయూ పత్రాలపై సంత కాలను చేశారు. అనంతరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. వర్సిటీ తరఫున రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్ ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. మూడేళ్లపాటు ఇది అమలులో ఉంటుందని, ప్రభు త్వం తరఫున తొలి వర్క్‌షాపు అక్టోబరు 7న నిర్వహి స్తామని చీఫ్ ఇంజనీర్ పేర్కొన్నారు.

నెల పాటు కాచిగూడ, నడికుడి రైళ్ల రద్దు

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మెయిన్‌టెనెన్స్ వర్కుల కారణంగా రెండు రైళ్లను నెల పాటు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఏ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 07791 కాచిగూడ - నడికుడి, 07792 నడికుడి - కాచిగూడ రైళ్లను అక్టోబరు 1 నుంచి 31 వరకు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణీకులు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బదిలీలలో అక్రమాలు.. అధికారులపై చర్యలు తప్పవు

- జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా



గుంటూరు సిటీ, సెప్టెంబర్ 26 : ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సిబ్బంది బదిలీలలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు.' జడ్పీ బదిలీలలో ఇష్టారాజ్యం'అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆమె గురువారం స్పందించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బదిలీలలో అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా వదిలేది లేదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన బది లీలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. దీర్ఘకాలం ఒకేచోట పనిచేస్తున్న వారిని నిబంధనలకు లోబడి బదిలీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు చేసిన సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్నామని వెల్లడించారు. కొందరు సిబ్బంది అవినీతికి పాల్పడినట్లు తన దృష్టికి వచ్చిన విషయాలపై కూడా విచారణ జరుపుతామన్నారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై సీఎంఓకు, కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న శాంటో బెనర్జీ తదితరులు

సరికొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమం

- పాలిటెక్నికో డిటోరినో డాక్టర్ శాంటో బెనర్జీ

గుంటూరు(విద్య),సెప్టెంబరు 26: నాన్ లీనియర్ అనాలిసస్‌తో ఆవిష్కరణలను,పరిశోధనలను వేగంగా తీసుకెళ్ళటంతో పాటు ఖచ్చితత్వం కలిగి సరికొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమం చేస్తుందని ఇటలీలోని పాలిటెక్నికో డిటోరినో డాక్టర్ శాంటో బెనర్జీ అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో మూడురోజుల పాటు నిర్వహించిన సదస్సు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా సావనీర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎన్ఐటి దుర్గాపూర్ ప్రొఫెసర్ సమర్జిత్‌కర్, ఐఐటీ ధన్‌బాద్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు పెంట్యాల, విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వీసీ ఆచార్య పీ.నాగభూషన్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

క్రోసూరు, సెప్టెంబరు 26 : ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి, తనిఖీ అధికారి వి.వేణుగోపాల్ హెచ్చరించారు. ఆయన ఆధ్వర్యంలోని అధికారుల బృందం గురువారం మండలంలోని దొడ్లేరులో ఫెర్టిలైజర్ షాపుల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. వివిధ షాపులకు చెందిన ఎరువుల గోడౌన్‌లను తనిఖీ చేశారు. ఎరువులు తూకం సక్రమంగా ఉందో లేదో పరిశీలించారు. అధిక ధరలకు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవటంతో పాటు అమ్మకాలను నిలిపి వేస్తామన్నారు. ప్రతి డీలర్ షాపుల వద్ద స్టాక్ బోర్డులు పెట్టాలని, వ్యవసాయ శాఖ అధికారి, వ్యవసాయ సహాయ సంచాలకుల ఫోన్ నెంబర్లతో కూడిన స్టిక్కర్లను రైతులకు కన్పించే విధంగా అతికించాలన్నారు. రైతులు తాము కొనుగోలు చేసిన ఎరువులకు ఈ పాసు మిషన్‌లో వేలి ముద్రలు వేయాల్సి ఉంటుందని తెలియజేశారు. నిబంధనలు పాటించక పోతే డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఆయన తెలిపారు.

మైనింగ్ ఏడీగా ప్రకాష్‌కుమార్

దాచేపల్లి, సెప్టెంబరు 26: దాచేపల్లి భూగర్భగనులశాఖ సహాయ సంచాలకులుగా పులివర్తి ప్రకాష్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటివరకు భూగర్భగనులశాఖ సహాయ సంచాలకులుగా పనిచేసిన అశోక్ కుమార్ అమలాపురం బదిలీపై వెళ్లారు. గురువారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రకాష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాలను సాధిస్తామని, నిబంధనలు పాటిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

ఏపీవోగా కోటిరెడ్డి

రెంటచింతల, సెప్టెంబరు 26: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవోగా కోటిరెడ్డిని నియమిస్తూ పీడీ జోసఫ్‌కుమార్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన కారంపూడి నుంచి ఇక్కడకు బదిలీపై వస్తుండగా ఇప్పటి దాకా ఇక్కడ విధులు నిర్వహించిన ఏపీవో జయచంద్రను కారంపూడికి బదిలీ చేశారు.

అక్రమ మద్యం స్వాధీనం

అచ్చంపేట, సెప్టెంబరు 26 : మండలంలోని గింజుపల్లికి తండాకు చెందిన భూక్యా రమణానాయక్ తెలంగాణా నుంచి మద్యం అక్రమంగా తీసుకెళ్తున్న క్రమంలో పోలీసులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కే వెంకటప్రసాదు తెలిపారు. తెలంగాణా నుంచి 80 మద్యం సీసాలు తీసుకు వస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రమణానాయక్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.





వైసీపీ పాలనలో మాచర్లలో అరాచకం

- ఒక్కసారి అవకాశమిస్తే ముంచేశారు
- రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కష్టపడుతున్న సీఎం చంద్రబాబు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, సెప్టెంబరు 26: గత వైసీపీ పాలనలో మాచర్లలో అరాచకం రాజ్యమేలిందని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. పట్టణంలోని నరిశెట్టి కల్యాణ మండపంలో గురువారం జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు ఒక్క అవకాశం ఇస్తే వైసీపీ నేతలు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేశారన్నారు. మాచర్ల నియోజకవర్గంలో దౌర్జన్యాలు, అక్రమాలు, రౌడీయిజంతో శాంతి భద్రతలకు విఘాతం కలిగించారన్నారు. అక్రమ కేసులు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. విసిగిపోయిన ప్రజలు కూటమి ప్రభుత్వానికి భారీ మెజార్టీ అందించారన్నారు. గాడి తప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల నుంచి మన్ననలు పొందారన్నారు. మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం డ్వాక్రా మహిళలకు మంజూరైన రూ.7,14,05,000 విలువైన చెక్కులను అందజేశారు. అలాగే సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు, యెనుముల కేశవరెడ్డి, కొమెర దుర్గారావు, కజ్జం సైదయ్య, కంభంపాటి అనిల్, వజ్రం నాయక్, సూరె యలమంద, సంబోసు వేణు, మదార్‌సాహెబ్, సిద్ధయ్య, మద్దిగపు వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, స్పెషలాఫీసర్ గబ్రూనాయక్, టీఎంసీ సుబ్బారావు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడిన వీరవనిత ఐలమ్మ

తెలంగాణ ప్రజల అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకొని ఆమె ఆశయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, చాకలి ఐలమ్మ సేవా సమితి వ్యవస్థాపకుడు మన్నెం పాండురంగారావు, టీడీపీ నేతలు కేశవరెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు చరిత్రకు అక్షర రూపమిచ్చిన సతీష్ అభినందనీయుడు

మాచర్లటౌన్, సెప్టెంబరు 26: మరుగున పడుతున్న పల్నాడు చరిత్రకు అక్షరరూపం ఇచ్చి తన పుస్తకాల ద్వారా అందిస్తున్న రచయిత పావులూరి సతీష్‌బాబు అభినందనీయుడని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రశంసించారు. సతీష్‌బాబు రచించిన 'మాచర్ల వరద 1964' పుస్తకాన్ని పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో గురువారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. సతీష్‌బాబు ఇప్పటికే మూడు పుస్తకాలు రచించారన్నారు.

పట్టణంలో 'ఇది మంచి ప్రభుత్వం'

పట్టణంలోని నెహ్రూనగర్‌లో గురువారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి వంద రోజుల పాలనలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, సూరె యలమంద, కొమెర శివ, కొండలు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కాలనీలో ఆక్రమణలు తొలగించాలని వినతి

తమ కాలనీలో ఆక్రమణలు అధికమయ్యాయని, వాటిని తొలగించాలని పట్టణంలోని విశ్వబ్రాహ్మణ కాలనీవాసులు గురువారం పట్టణంలో ఎమ్మెల్యేకి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ తమకు 2004, 2005లలో రెండు దఫాలుగా 200 ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయని, కొందరు హౌసింగ్ రుణాలతో గృహాలు నిర్మించుకోగా, మరికొందరు ఆర్థికస్తోమత లేక నిర్మాణాలు చేపట్టలేదన్నారు. అయితే ప్రస్తుతం హైవే పనులు జరుగుతుండడంతో కొన్ని ప్లాట్లు హైవే నిర్మాణాల కింద పోయాయని, మరికొన్ని ప్లాట్లు ఆక్రమణకు గురయ్యాయని వివరించారు. ఆక్రమణలు తొలగించి న్యాయం చేయాలని ఎమ్మెల్యేని కోరారు.

యలమందకు ఎమ్మెల్యే పరామర్శ

పట్టణంలోని పాతూరుకు చెందిన టీడీపీ నేత మున్నా యలమంద గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న బ్రహ్మానందరెడ్డి గురువారం పాతూరులోని యలమంద గృహానికి చేరుకొని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని ధైర్యం చెప్పారు.

రూ.1.18 కోట్లతో ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతులు చేపట్టాలి

రెంటచింతల, సెప్టెంబరు 26: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే ఆర్ అండ్‌బీ రహదారుల మరమ్మతులను వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. రూ.1.18 కోట్ల నిధులను ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ నయీముల్లా గురువారం విడుదల చేశారన్నారు. ఈ నెల 28వ తేదీన పనులు ప్రారంభించి వచ్చే నెల 28వ తేదీకల్లా పూర్తి చేయాలన్నారు. ఆర్‌అండ్‌బీ ఈఈ యూసఫ్ గురువారం పలు రహదారులను పరిశీలించారు.

దేవాలయాలపై దాడులు చేసిన వారిని శిక్షించాలి

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



పరిరక్షణ ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, సెప్టెంబరు 26 : హిందూ దేవాలయాలపై దాడులు చేసిన వారిని శిక్షించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం వద్ద గురువారం తిరుమల పరిరక్షణ ర్యాలీకి జెండా ఊపి కన్నా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి ఆలయ ప్రతిష్ట దిగజార్చేందుకు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వైఎస్ జగన్ ఎంతగానో ప్రయత్నించారన్నారు. భక్తులకు ఎన్నో అవరోధాలు, అసౌకర్యాలు కల్పించారన్నారు. లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేయటం దుర్మార్గం అన్నారు. తిరుపతి లడ్డు ప్రసాదాన్ని అపచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. అపవిత్రం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం దగ్గర నుంచి కూరగాయల మార్కెట్ వరకు తిరుపతి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కన్నా, పరిరక్షణ కమిటీ సభ్యులు పూజలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ప్రత్యే పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, దివ్వెల శ్రీనివాసరావు, సింగరి నాగ భూషణం తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలన ప్రజా రంజకం

సత్తెనపల్లి, సెప్టెంబరు 26: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పాలన ప్రజా రంజకంగా సాగుతుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణం లోని 16వ వార్డులో గురువారం సాయంత్రం ఇది మంచి ప్రభు త్వం కార్యక్రమంలో భాగంగా జరిగిన సభలో ఆయన మాట్లాడు తూ అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అక్టోబరు 1వ తేదీ నుంచి గ్రామ, వార్డు సభలు నిర్వహించి అర్హులైన కొత్త పింఛన్‌దారులను ఎంపిక చేస్తారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల కరపత్రాలను పార్టీ నేతలతో కలసి ఆయన పంపిణీ చేశారు. ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికించారు. ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండట్లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు

రాజుపాలెం, సెప్టెంబరు 26: వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో లేకపోవటంతో రోగులు ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేసుకుంటున్నారు. కొద్ది రోజుల నుంచి రోగులు వైద్యశాలకు వెళ్లిన సమయంలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. రక్త పరీక్షలు చేయడానికి ల్యాబ్ టెక్నీషియన్ కూడా ఉండటంలేదు. గురువారం నీలిమ, మొర్రిబోయిన అజయ్, తదితరులు వైద్యశాలకు వెళ్లారు. ఆ సమయంలో డాక్టర్లు, ల్యాబ్ టెక్నీషియన్ వైద్యశాలలో అందుబాటులో లేరు. అదేమని అక్కడున్న సిబ్బందిని అడిగితే ఇద్దరు వైద్యుల్లో ఒకరు సమ్మెలో, మరొకరు ఎఫ్‌డీపీ ప్రోగ్రామ్‌లో ఉన్నారని సమధానమిచ్చారు. ఈ సందర్భంగా రోగులు విలేకర్లతో మాట్లాడుతూ వైద్యశాలలో ప్రతిరోజు వైద్యులు అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. ఇదే విషయంపై వారు స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు ఫోన్లో ఫిర్యాదు చేశారు.

న్యాయవాదులపై ఉక్కుపాదం మోపేందుకు కుట్ర

సత్తెనపల్లి, సెప్టెంబరు 26 : కేంద్ర ప్రభుత్వం న్యాయవాదుల పై ఉక్కుపాదం మోపేందుకు కుట్ర పన్ని ప్రత్యేక చట్టాలు తీసుకు వస్తుందని నిరసన వ్యక్తం చేస్తూ న్యాయవాదులు గురువారం న్యాయదేవత విగ్రహం వద్ద ఆందోళన చేశారు. న్యాయవాదులపై దాడులు జరగకుండా పరిరక్షించే చట్టాలు తీసుకురాకుండా న్యాయ వాదులనే ఇబ్బంది పెట్టే చట్టాలు రూపొందించటం హేయమని అన్నారు. న్యాయవాదులు విధులను బహిష్కరించి తమ నిరసనను తెలియజేశారు.

బెల్లంకొండ ఎంపీడీవోగా హనిమిరెడ్డి

బెల్లంకొండ, సెప్టెంబరు 26: మండల నూతన ఎంపీడీవోగా హనిమిరెడ్డి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో యడ్లపాడు మండలంలో ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై బెల్లకొండ మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సిబ్బంది ఆయనను మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.

టీడీపీ మండల నాయకులు ఎంపీడీవోను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీవోను కలసిన వారిలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వెంకటరామిరెడ్డి, సర్పంచ్ జ్యోతి సముద్రం పాల్గొన్నారు.

100 రోజుల పాలనపై వార్డు సభలు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 26: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజుల పాలనపై సాధించిన విజయాలను వివరిస్తూ గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో సభలు నిర్వహించారు. ప్రభుత్వం సాధించిన విజయాలను అందరికీ వివరిస్తూ సంక్షోభంలోనూ సంక్షేమాన్ని కొనసాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అమీర్ అలి, పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, వడ్డవల్లి సాంబశివరావులు తెలిపారు. కార్యక్రమాల్లో కమిషనర్ శ్రీధర్, షేక్ బాబావలి, పిల్లి చెన్నారావు, నెకరికంటి శివ, దేవళ్ల రాంబాబు, వేముల అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

లైమ్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మృతి



కోట వెంకట సుబ్బారావు (ఫైల్‌ఫొటో)

పిడుగురాళ్ల, సెప్టెంబరు 26: పిడుగురాళ్ల లైమ్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ సున్నం వ్యాపారి కోట వెంకట సుబ్బారావు గురువారం మృతి చెందారు. వెంకట సుబ్బారావు మృతికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, ప్రముఖ సున్నం వ్యాపారులు భవనాశి ఆంజనేయులు, నరసింహారావు, కనిగిరి శ్రీను, పాండురంగ శ్రీను, లైమ్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట హరి, పాండురంగారావు, శ్రీరామ్ శ్రీనివాసరావు, మల్లెల ఆదినారాయణ, ఎల్‌వీఆర్, అసోసియేషన్ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆస్తి వివాదంలో అన్నకొడుకు ఇల్లు నేలమట్టం

అమరావతి, సెప్టెంబరు 26: పూర్వీకుల నుంచి వచ్చిన 1.5 ఎకరా భూమిని తండ్రి మరణానంతరం సోదరులకు తెలియకుండా చిన్నకుమారుడు తన పేరున, భార్యపేరున రిజిష్టర్ చేయడమే కాకుండా ఇదేమిటని అడిగిన అన్న కుమారుడు ఇంటిని జేసీబీతో కూల్చివేసిన ఘటన మండల పరిధిలోని అత్తలూరులో జరిగింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన వేముల వెంకటప్పయ్యకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అతడికి పూర్వీకుల నుంచి సంక్రమించిన 1.5ఎకరా భూమి ఉంది. అతడి మరణానంతరం ఆ భూమిని భార్య పేరున కాకుండా కుమారుల్లో చిన్నవాడైన కోటేశ్వరరావు ఎవరికి తెలియకుండా స్థానిక వైసీపీ నాయకుడి సహకారంతో మూడు సంవత్సరాల క్రితం తన పేరు మీదకు రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించుకుని అందులో ఎకరం భూమిని తన భార్య కొండమ్మ పేరున రిజిష్టర్ చేయించాడు. ఆలస్యంగా తెలుసుకున్న వెంకటప్పయ్య రెండో కుమారుడి కుమారులు తమ బాబాయి చేసిన పనిని తెలుసుకుని నిలదీశారు. దీంతో పాటు 50సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను కూడా వెంకట్రావు ఆక్రమించుకోవడానికి ఉపక్రమించగా వెంకటప్పయ్య పెద్దకుమారుడైన పెద వెంకటేశ్వర్లు రెండో కుమారుడు గూండారావు అడ్డుకోగా అతడు నివాసం ఉంటున్న ఇంటిని ఎవరూ లేని సమయంలో వెంకట్రావు జేసీబీ తీసుకు వచ్చి నేలమట్టం చేశాడు. తమ బాబాయి వెంకట్రావును ఆస్తి విషయమై నిలదీసినందుకే తమ ఇంటిని నేలమట్టం చేశాడని గూండారావు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతేగాక వెంకటప్పయ్య రెండో కుమారుడు చిన వెంకటేశ్వర్లు ఇద్దరు కుమారులు ఎస్సీ మహిళలను వివాహం చేసుకున్నారు. అందుకు మిమ్మల్ని కుటుంబం నుంచి వెలివేశామని ఆస్తిలో వాటా లేదని వెంకట్రావు వారిపై దౌర్జన్యానికి దిగాడు. తమకు రావాల్సిన భూమిలో వాటా ఇవ్వకుండా, ఇంటిని నేలమట్టం చేసిన తమ బాబాయి వెంకట్రావుపై ఫిర్యాదు చేసి తమకు న్యాయం చేయాలని అన్న కుమారులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

పర్యాటక కేంద్రంగా పులిచింతల అభివృద్ధి

- చిగురుపాడును ఉత్తమ గ్రామంగా అభివృద్ధి చేస్తా
- మాదిపాడు బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం
- 'ఇది మంచి ప్రభుత్వం'లో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



ప్రజా వేదిక కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అచ్చంపేట, సెప్టెంబరు 26 : మండలంలోని చిగురుపాడు గ్రామాన్ని ఉత్తమ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం చిగురుపాడులో జరిగిన ప్రజావేదికలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు తీసుకు వచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గానికి రూ.12 కోట్లు నిధులు తెచ్చి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టానన్నారు. మాదిపాడు వద్ద కృష్ణా నదిపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.60 కోట్ల నిధులతో ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. పులిచింతల ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తానని తెలియజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు త్వరలో నెరవేరనున్నట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ముందుగా గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన మురుగు కాలువలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంధం కోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, నల్లమేకల వెంకటేశ్వర్లు, మద్దిరాల గంగాధర్, మొక్కపాటి గిరిబాబు, పోట్ల శ్రీనివాసరావు, పసుపులేటి పాపి రెడ్డి, అనూపకళ, తిరువాయిపాటి ఆంజనేయులు, అనుముల అంజనేయులు, శివరాత్రి పెద్ద శ్రీను, ఏపూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. మండలంలోని కోనూరులో రూ.85 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన వాటర్ హెడ్ ట్యాంక్‌ను ప్రారంభించారు. ఇంటింటికి కుళాయిలను ఏర్పాటు చేశారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఏర్పాటైన దీని ద్వారా ప్రజలకు దాహార్తి తీరుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో నందిగం ఆశీర్వాదం, పాటిబండ్ల బాపిరాజు, వెనిగండ్ల కోటయ్య, చందు, నల్లమేకల వెంకటేశ్వర్లు, బత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మంచి భవిష్యత్తు

రెంటచింతల, సెప్టెంబరు 26: చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని సెయింట్ జోసఫ్ హైస్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ పీటర్ పాపయ్య అన్నారు. గురువారం జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందిస్తూ పలు సూచనలు చేశారు. ఖోఖో అండర్ - 17 విభాగంలో సందీప్, అండర్ - 14 విభాగంలో జేమ్స్ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారు. గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్‌కు చెందిన భానుప్రసాద్, నానిబాబు, చంటి, హరియానాయక్‌లు పరుగుపందెం, డిస్కస్‌త్రో, యోగాసనాలలో జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దుర్గా ప్రసాద్, ప్రిన్సిపాల్ మోహన్, పీఈటీలు షేక్ సుభాని, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గిలో అథ్లెటిక్స్, యోగా క్రీడాకారుల ఎంపికలు

దుర్గి, సెప్టెంబరు 26: దుర్గిలోని జడ్పీ హైస్కూల్లో గురువారం నియోజకవర్గస్థాయి అథ్లెటిక్స్, యోగా క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. నియోజకవర్గలోని ఐదు మండలాల నుంచి అండర్- 14, 17 విభాగాల్లో సుమారు 200 మంది బాలబాలికలు పాల్గొన్నారు. వీరికి అథ్లెటిక్స్, యోగా పోటీలు పెట్టి నియోజకవర్గస్థాయిలో ఎంపిక చేశారు.

నియోజక వర్గ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

పెదకూరపాడు, సెప్టెంబరు 26 : నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు పెదకూరపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం నిర్వహించారు. నియోజకవర్గంలోని అచ్చంపేట, క్రోసూరు, పెదకూరపాడు, అమరావతి, బెల్లంకొండ మండలాల టీమ్‌లు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కాకాణి వెంకటరమణ, జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య హైస్కూల్ డైరెక్టర్ గుత్తా రాములు పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలు పెదకూరపాడు నియోజకవర్గానికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ సీహెచ్ నాగరాజు, జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య హైస్కూల్ ప్రిన్సిపాల్ కవిత, సాంబశివరావు, రాధాకృష్ణ, మురళీధర్, పూర్ణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపల్లిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 26: మండలంలోని తాళ్లపల్లిలో గురువారం సర్పంచ్ పసుపులేటి బ్రహ్మానాయుడు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్ర మం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి వంద రోజుల ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో బట్టు సత్యనారాయణరెడ్డి, పెద్దిరాజు, నాలం అమర నాగేశ్వరరావు, వెంకటేష్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి వెంకట్రామయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వంపై ఇంటింటి ప్రచారం

అమరావతి, సెప్టెంబరు 26: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తమ వంద రోజు ల పాలనపై నిర్వహిస్తున్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం గురువారం అమరావతిలోని ఎస్సీ కాలనీలో టీడీపీ నాయకురాలు గొట్టెం రత్నకుమారి ఆధ్వర్యంలో జరిగింది. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ పోస్టర్లను ఇంటింటికి అంటించారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, కరీముల్లా, కాంతమ్మ, భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

24వ వార్డులో ఇది మంచి ప్రభుత్వం

సత్తెనపల్లి, సెప్టెంబరు 26: పట్టణంలోని 24వ వార్డులో గురు వారం సాయంత్రం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు పాల్గొని వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను వివరించారు. కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జింకా లోకేశ్వరరావు, ఫణిదరపు నరసింహారావు, రాజేశ్వరి, రామారావు, వేణు, సచివాల య ఉద్యోగులు పాల్గొన్నారు.

చెన్నాయపాలెంలో 'ఇది మంచి ప్రభుత్వం'

పిడుగురాళ్ల, సెప్టెంబరు 26: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షోభంలోనూ సంక్షేమం కొనసాగించడం ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమైందని జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, టీడీపీ మండల కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం చెన్నాయపాలెంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. 100 రోజుల పాలనలో సాధించిన విజయాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. అనంతరం సచివాలయం వద్ద మొక్కలు నాటారు.



చదరంగం జిల్లా స్థాయి పోటీలకు జై భారత్ హైస్కూల్ విద్యార్థులు

క్రోసూరు, సెప్టెంబరు 26 : డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారు నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో క్రోసూరు జై భారత్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి ఇద్దరు విద్యారుథలు జిల్లా స్థాయి చదరంగం పోటీలకు, ఒక విద్యార్థి నాలుగు వందల మీటర్ల రిలే రన్నింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ టీ జయనేంద్రారెడ్డి తెలియజేశారు. అండర్ - 14 విభాగంలో 8వ తరగతి విద్యార్థులు షేక్ ఆరీఫ్ ప్రథమ స్థానంలో నిలిచాడని, అండర్- 17 విభాగంలో 9వ తరగతి విద్యార్థి జీ తులసీ శ్రీచైతన్య ద్వితీయ స్థానంలో నిలిచాడని, వీరిద్దరు జిల్లా స్థాయి చదరంగం పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అలాగే అండర్- 14 కేటగిరిలో నాలుగు వందల మీటర్ల రిలే రన్నింగ్ పోటీల్లో 6వ తరగతి విద్యార్థి కే సిద్దార్థ్ ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ షేక్ ఖదీర్, వ్యాయామ ఉపాధ్యాయులు కే రాజు, సీహెచ్ సతీష్, పాఠశాల అధ్యాపక బృందం అభినందించారు.

ఎంపీడీవోకు టీడీపీ నాయకుల సత్కారం



ఎంపీడీవో శ్రీనివాసరావును సత్కరిస్తున్న టీడీపీ మండల నాయకులు

మాచవరం, సెప్టెంబరు 26: మాచవరం మండలం నూతన ఎంపీడీవో పీ శ్రీనివాసరావును టీడీపీ మండల నాయకులు సత్కరించారు. గురువారం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల ప్రజలు, నాయకుల సహాయ, సహకారాలతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎంపీడీవోను సత్కరించిన వారిలో కొత్తపాలెం సర్పంచ్ యామని రామారావు, మాజీ సర్పంచ్ గమ్మిగుంపుల వెంకటేశ్వర్లు, పిల్లుట్ల సర్పంచ్ లగుమవరపు శివపార్వతి సాంబశివరావు, బొగ్గవరపు అంజయ్య, చింతల వెంకట నరసయ్య, పలిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



కోడెల శివప్రసాదరావు ఉద్యానవనంలో కూల్చివేసిన వేదిక

ఉద్యానవనంలో వేదిక కూల్చివేత

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 26: నరసరావుపేట పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో ఉన్న డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఉద్యానవనంలోని వేదికను గురువారం కూల్చివేశారు. ఏపీ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ అమృత్ పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి పథకం కింద ఎన్‌జీవో కాలనీలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఉద్యానవనం నిర్మించారు. నాటి మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా హయాంలో నిర్మించిన ఈ ఉద్యానవనంను అప్పటి స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు 2018లో ప్రారంభించారు. అయితే ఉద్యానవనంలోని వేదిక కూల్చివేత చర్చనీయాంశం అయింది. స్థానికులు వేదికను చదునుచేసి కమ్యూనిటీహాల్ నిర్మించుకుంటామని చెబుతున్నారు. ఈ విషయంలో కమిషనర్ ఎం.జస్వంతరావును వివరణ కోరగా కూల్చివేతకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. కమ్యూనిటీ హాలు కట్టాలన్నా, వేదికను కూల్చివేయాలన్నా మున్సిపాలిటీ అనుమతి అవసరమని కమిషనర్ చెప్పారు. ఈ విషయం తమకు తెలియదని, కూల్చివేతను వెంటనే ఆపివేస్తామని చెప్పారు.



పెరుమాళ్ళపల్లి మేజర్ వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం: ఎమ్మెల్యే జీవీ

ఈపూరు, సెప్టెంబరు 26: ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ పరిధిలోని ఈపూరు మండలంలో పెరుమాళ్ళపల్లి మేజరు దిగువ భూముల రైతులు రెండు రోజుల నుంచి నీటికోసం కాలువ వద్ద పడిగాపులు కాస్తున్నారు. కాలువ వద్ద ఉన్న రైతులను గురువారం ఎమ్మెల్యే ఆంజనేయులు పలకరించారు. రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. మూడు సంవత్సరాలుగా కాలువలో నాచు తొలగించకపోవడం, కట్టలకు ఇరువైపులా ఉన్న పిచ్చికంప తొలగించకపోవడంతో సాగునీరు చివర భూములకు చేరడం లేదన్నారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే ఎన్నెస్పీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం హయాంలో కాలువలలో పూడిక తీయకపోవడం వల్లనే సమస్య వచ్చిందన్నారు. బొల్లా బ్రహ్మనాయుడు అవినీతి, అక్రమాలు తప్ప రైతులను పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, రాపర్ల జగ్గారావు, బాలయ్య, కోటేశ్వరరావు, సత్యనారాయణ ఉన్నారు.



జాషువా సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవిందబాబు

చిరస్మరణీయుడు మహాకవి జాషువా

● ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు, 26: తన రచనలతో సమాజాన్ని చైతన్యవంతంచేసిన మహాకవి గుర్రం జాషువా సదా చిరస్మరణీయుడని స్థానిక శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు కొనియాడారు. గురువారం జాషువా 129వ జయంతి సందర్భంగా స్థానిక భువనచంద్ర టౌన్‌హాల్‌లో జరిగిన సంస్మరణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను తన రచనల ద్వారా ఎత్తి చూపారన్నారు. తొలుత జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో దీక్ష చేపట్టిన జనసేన పార్టీ నాయకులు నాగశ్రీను, పార్టీ నాయకులు

జనసేన నాయకుల ప్రాయశ్చిత్త దీక్ష

వినుకొండ టౌన్, సెప్టెంబరు 26: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా వినుకొండ జనసేన పార్టీ సమన్వయకర్త కొంజేటి నాగశ్రీను రాయల్ ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం దీక్ష చేపట్టారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు అవశేషాలు ఉన్నాయని, లడ్డూ తయారీలో జరిగిన కల్తీపై క్షమించమంటూ దీక్ష చేపట్టినట్లు నాగశ్రీను తెలిపారు. ఈ దీక్ష 7 రోజుల పాటు కొనసాగుతుందని శ్రీవారిని దర్శించిన తర్వాత ప్రాయశ్చిత్త దీక్షను విరమించనున్నట్లు ఆయన తెలిపారు. దీక్షలో భాగంగా గుంటి ఆంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం భారీఎత్తున హోమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. పార్టీ నాయకులు, జనసేన వీర మహిళలు, పవన్ అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎంఏఎం ఫార్మసీలో హెచ్‌ఐవీపై అవగాహన

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 26: స్థానిక ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, హాండ్స్ ఆఫ్ కంపాషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్/హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కార్తీక్, హాండ్స్ ఆఫ్ కంపాషన్ ప్రాజెక్టు పీఎం ఉదయరాజు, ఓఆర్‌డబ్ల్యూ మేరీ, శివరాజు, అంజలీ, మీరా, విజయరజనీ, జ్యోతి, ఆషా, ప్రసన్న, మణి తదితరులు పాల్గొన్నారు.



కళాశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న ఏఎంరెడ్డి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు

ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 26: స్థానిక ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు కళాశాల పరిసర ప్రాంతాలను శుభ్రంచేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఆట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



ఈపూరులో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ఈపూరు, సెప్టెంబరు 26: రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రమైన ఈపూరులో గురువారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా గ్రామ కూడలిలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళిలర్పించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే జీవీ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి పథకాలను అమలుచేస్తూ గ్రామాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నామన్నారు. అర్హులైనవారికి పథకాలను అందించడం జరుగుతుందన్నారు. అక్టోబరు నుంచి కొత్త పింఛన్ల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం మంజూరుచేసిన రుణాల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. పట్టాదారు పాస్తుకాలు ఇవ్వటంలేదని, బ్యాంకులలో పంట రుణాలకోసం అడంగల్ కూడా ఇవ్వడంలేదని రెవెన్యూ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దారు నళినికి సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పల్నాడు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, మండల ప్రత్యేకాధికారి రమణారెడ్డి, జనసేన నాయకులు నిశ్శంకరావు శ్రీనివాసరావు, కే నాగశ్రీను, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య, మాజీ ఎంపీపీ బొల్లా వెంకట కోటయ్య, మాజీ జడ్పీటీసీ బందెల కన్నయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం: ఎమ్మెల్యే జీవీ

ఈపూరు, సెప్టెంబరు 26: పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చునని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఈపూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గురువారం ఈపూరు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు శ్రీమంతం, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.

పేరూరుపాడులో ...

బొల్లాపల్లి, సెప్టెంబరు 26: మండలంలోని పేరూరుపాడులో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ సీనియర్ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు గ్రామంలోని టీడీపీ నాయకులతో కలసి ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి పెమ్మసాని నాగేశ్వరరావు మాట్లాడుతూ పేదలకు అనేక సంక్షేమ పథకాలు, ప్రతి 1వ తేదీనే రూ 4వేలు పింఛన్‌ను అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కాసరగడ్డ గోవిందరాజులు, గంగినేని రమణయ్య, బొప్పూడి శ్రీనివాస్, గరికపాటి శరత్, రాచపల్లి ఏడుకొండలు, ముప్పాళ్ళ శ్రీనివాసరావు, శీలం ఐతన్న, పీ శ్రీనివాసరావు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మపై బ్రిడ్జి నిర్మాణానికి నేడు శంకుస్థాపన

● నదీ పరివాహక ప్రాంతవాసుల్లో హర్షాతిరేకాలు

● బ్రిడ్జితో జాతీయ రహదారికి రోడ్లు అనుసంధానం



గుండ్లకమ్మ నదిని దాటుతున్న నూజెండ్ల మండల గ్రామాల ప్రజలు

వినుకొండ, సెప్టెంబరు 26: గుండ్లకమ్మ నదిపై బిడ్జి నిర్మాణంతో ప్రజల కష్టాలు తీరనున్నాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో జీవీ ఆంజనేయులు చొరవతో నేడు బిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అందుగుల కొత్తపాలెం వద్ద సుమారు రూ.15.83 కోట్లతో బిడ్జి నిర్మాణంతో, జాతీయ రహదారులకు అనుసంధానం ఏర్పడి ప్రజలకు ప్రయాణం సులువు కానుంది. కొత్తపాలెం వద్ద గతంలో వైసీపీ ప్రభుత్వం హయాంలో బిడ్జి నిర్మాణం కోసం సుమారు 15.83 కోట్లు (పీఎంజీఎస్‌వై) పథకం కింద నిధులు మంజూరైయ్యాయి. మంజూరైన నిధుల్లో 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు చెల్లించాల్సి ఉంది. జగన్ ప్రభుత్వంలో 40 శాతం నిధులు కేంద్రానికి చెల్లించకపోవడంతో బిడ్జి నిర్మాణం ఆగిపోయింది.

40 శాతం నిధులు మంజూరు

కొత్తపాలెం వద్ద ఆగిపోయిన బిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని వరద బాధితులకు రూ.50 లక్షలు విరాళం చెక్కును ఎమ్మెల్యే జీవీ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు అందచేస్తున్న సమయంలో కోరారు. వెంటనే స్పందించిన చంద్రబాబు నాయుడు 40 శాతం మ్యాచింగ్ గ్రాంట్ మంజూరు చేశారు. దీంతో బిడ్జి నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోవడంతో, సమారు 250 మీటర్లు పొడవు, 7.5 మీటర్లు వెడల్పుతో అధికారులు బిడ్జి నిర్మాణం చేపట్టనున్నారు. బిడ్జి నిర్మాణం ద్వారా నూజెండ్ల మండలం మృత్యుంజయపురం, ముక్కపల్లి, నాగిరెడ్డిపల్లి, పాత నాగిరెడ్డిపల్లి నుంచి నేరుగా కొత్తపాలెం వద్ద అనంతపురం- గుంటూరు జాతీయ రహదారికి చేరుకోవచ్చు. ఇదిలా ఉండగా కొత్తపాలెం నుంచి సుమారు 5 కిలోమీటర్ల పరిధిలో చీకటీగలపాలెం జంక్షన్‌కు వెళ్లకుండా నేరుగా చింతల చెరువు వద్దకు చేరుకునే అంకాశం ఉండడంతో ఆప్రాంతవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కేవలం 100 రోజుల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో ఇది మంచి ప్రభుత్వం అని చెబుతున్నారు. ఇప్పటికే గత ఏడాదిన్నర క్రితం 3.65 కోట్ల రూపాయలతో గుండ్లకమ్మకు ఇరువైపులా సుమారు ఐదు కిలోమీటర్లు పొడవునా తారురోడ్డు నిర్మాణం పూర్తయింది.

ప్రజా సంక్షేమానికి కట్టుబడిన కూటమి ప్రభుత్వం

పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 26: కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు అభినందనలు తెలిశారు. జిల్లావ్యాప్తంగా ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం హామీలలో పింఛన్ల పెంపు కార్యక్రమం వెంటనే చేపట్టిందన్నారు. వైసీపీ ప్రభుత్వం దఫదఫాలుగా పెంచిందని, కూటమి ప్రభుత్వం వెంటనే పెంచి పేదలను ఆదుకుందన్నారు. మహిళలకు సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. రానున్న రోజులలో రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు వేగంగా జరుగుతాయన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ తప్పక అమలు చేస్తుందన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల, ల్యాండ్ టైటిలింగ్ రద్దు వంటివి చేశామన్నారు. వరదలలో నష్టపోయిన వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుందన్నారు. దీపావళి నుంచి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్‌లు కార్యక్రమం ప్రారంభించడానికి సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని నాశనం చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో పునఃనిర్మాణం జరుగుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను అస్తవ్యస్తం చేసిందని, రాష్ట్రాన్ని తిరిగి ప్రగతి పథంలోకి తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషిచేస్తున్నారని, ప్రజలకు ఆయన అండగా ఉంటారని అన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్



వినుకొండ టౌన్, సెప్టెంబరు 26: వినుకొండ మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ వెల్లడించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ గురువారం ఆంధ్రజ్యోతితో పలు విషయాలను వెల్లడించారు. సమస్యలపై త్వరలో ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతిరోజు మునిసిపల్ ఇంజనీరింగ్ సిబ్బందితో నీటి పరీక్షలు చేపట్టడం జరుగుతుందన్నారు. శుద్ధిచేసిన నీటిని ఉదయం, సాయంత్రం వేళల్లో నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. నీటి పరిశుభ్రతకు ప్రత్యేకంగా ఏఈ శ్రీదేవి పనిచేస్తున్నారని, నీటి శుద్ధిపై ఏమైనా అనుమానాలు ఉంటే 9866182481 ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చు అన్నారు. వినుకొండలో షాపు యజమానులు, తన షాపు ముందు భాగాన ఉన్న మున్సిపల్ స్థలాన్ని అద్దెకు ఇచ్చి వేల రూపాయలు వసూలు చేస్తున్న విధానాన్ని అరికడతామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యగా ఉందని, కమిషనర్, పోలీసుల సాయంతో డ్రెయిన్లపై ఆక్రమలు తొలగిస్తామన్నారు. ఆక్రమణ తొలగింపుకోసం ప్రత్యేక వాహనం ఏర్పాటు చేస్తామన్నారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తే ఆవులకోసం ప్రత్యేక స్థలం కేటాయించి, ఆవులను రోడ్డుపైకి రాకుండా చూస్తామని తెలిపారు. వినుకొండ మున్సిపాలిటీ ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఆరు కోట్లు అప్పుల్లో ఉందని, గతంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లు చెల్లించలేక పోతున్నామన్నారు. త్వరలో ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్లతో ప్రజలకు అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి పెడతామని కమిషనర్ తెలిపారు. వినుకొండ పట్టణ తాగు నీటి అవసరాల కోసం మంజూరైన 159కోట్ల నీటి పథకం ఆగిపోవడానికి కేంద్రానికి మ్యాచింగ్ గ్రాంట్ చెల్లించలేకపోవటమే కారణం అన్నారు. వినుకొండ ఎమ్మెల్యే జీవీ చంద్రబాబు దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లటంతో, రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించడం జరిగిందని, ఆగిపోయిన వాటర్ స్కీమ్ త్వరలో పూర్తి చేస్తామన్నారు.



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 26: ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధించాలని, మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం నరసరావుపేట పట్టణంలో విద్యార్థులు ఏర్పాటుచేసిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ తడి, పొడి చెత్త వేరుచేసి ఎప్పటికప్పుడు పరిసర ప్రాంతాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు.

28 నుంచి రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు

వినుకొండ టౌన్, సెప్టెంబరు 26: స్థానిక లయోలా పాఠశాల్లో ఈ నెల 28,30 తేదీల్లో 68వ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్ అండర్-17 బాల బాలికల ఫుట్‌బాల్, రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా స్కూల్ గేమ్ సెక్రటరీ ఎం.సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 13జిల్లాల నుంచి 520మంది బాల బాలికలు, కోచ్ మేనేజర్లు పాల్గొంటారన్నారు.

పాఠశాలకు తాగునీటి సౌకర్యం

రొంపిచర్ల, సెప్టెంబరు 26: మండలంలోని సంతగుడిపాడు జడ్పీ పాఠశాలకు పిడుగురాళ్ళ విజయ నర్సింగ్ హోంకు చెందిన డాక్టర్ కోసూరి సుబ్బారావు ఆర్వో ప్లాంట్ మరమ్మతుల కోసం రూ.15వేలు వెచ్చించి తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆయనకు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కోసూరు నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు గురువారం అభినందనలు తెలిపారు.

ట్రాఫిక్ సీఐగా లోకనాథం

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 26: నరసరావుపేట ట్రాఫిక్ సీఐగా సీహెచ్ లోకనాథం గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2009లో ఎస్ఐగా సర్వీస్‌లో చేరిన ఆయన మాచవరం, అడవులదీవి, నర్సరావుపేటలో సేవలందించారు తదుపరి ఒంగోలు పీటీసీ కళాశాలకు బదిలీపై వెళ్లారు ఆరు నెలల క్రితం సీఐగా పదోన్నతి పొందారు. 2014 నుంచి 2012 వరకు నరసరావుపేటలో ఎస్ఐగా సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచన మేరకు నరసరావుపేటలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

విశ్రాంత ఆర్జేడీ సీఏవీ ప్రసాద్‌కు ఘన నివాళి

వినుకొండ, సెప్టెంబరు 26: స్థానిక లయోలా పాఠశాల ఆవరణలో విశ్రాంత ఆర్జేడీ సీఏవీ ప్రసాద్ సంస్మరణ సభ గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విశ్రాంత ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని ప్రసాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశాంత ఉద్యోగులు పాలపర్తి విజయభాస్కర్, డీఎస్ రాజ్‌కుమార్, కనుమూరి జాషువా, గంగవరపు జగ్జీవన్, ఎస్‌డీవీ ప్రసాద్, డాక్టర్ మోహన్‌రావు, మంద జేమ్స్, వి.భూషణం, కె.వై నాగయ్య, లూకా, జాన్‌సుందరరావు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్

శావల్యాపురం, సెప్టెంబరు 26: సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతలను పాటించాలని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ పిలుపునిచ్చారు. మండలంలోని మతుకుమల్లిలో పరిసరాల పరిశుభ్రత, దోమలు నిల్వఉండే ప్రదేశాలను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శావల్యాపురం పీహెచ్‌సీలో రికార్డులు, ఓపీలు, జ్వరాల సర్వే నివేదికలు, ఫ్రైడే-డ్రైడే పురోగతి, మందుల నిల్వలు తదితర అంశాలను పరిశీలించారు.

పరిపాలన అధికారిగా స్వరూపరాణి బాధ్యతల స్వీకారం

నాదెండ్ల, సెప్టెంబరు 26: మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారిగా సవలం స్వరూపరాణి బాధ్యతలు స్వీకరించారు. ఆమె అచ్చంపేట ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తూ బదిలీపై నాదెండ్లకు వచ్చారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పనిచేస్తున్న షేక్ జాకీర్ హుస్సేన్ యడ్లపాడు ఈవోపీఆర్‌డీగా బదిలీ చేశారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన త్రిసభ్య కమిటీ

యడ్లపాడు, సెప్టెంబరు 26: యడ్లపాడు మండలం బోయపాలెం పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై ఏర్పాటుచేసిన త్రిసభ్య కమిటీతో కలసి పాఠశాలను సందర్శించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కో-ఆర్డినేటర్ పద్మజ తెలిపారు. ఈ నెల 23న పాఠశాల గోడ దూకి విద్యార్థులు పరారీ అయిన విషయం, పాఠశాలలో నెలకొన్న సమస్యలపై సమీక్షించేందుకు కారంపూడి, తాడికొండ, చుండూరు పాఠశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్‌తో కమిటీ వేయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో వారు గురువారం పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కమిటీ సభ్యులు కొన్ని సూచనలు చేశారు. పాఠశాలలో నెలకొన్న పరిస్థితులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నామన్నారు. విద్యార్థులను రెచ్చగొట్టి గోడదూకి పారిపోయేలా ప్రోత్సహించిన వారిని గుర్తించడం జరిగిందని, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థులతో అనుసరించాల్సిన పద్ధతులపై ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌లకు సూచనలు చేశామన్నారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఉన్నతాధికారుల ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.



స్వర్ణాంధ్ర 2047 గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి తదితరులు

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, సెప్టెంబరు 26: నవ్యాంధ్రప్రదేశ్‌ను పేదరికం లేని రాష్ట్రంగా అభివృద్ధి చేయటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాజీమంత్రి చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో స్వర్ణాంధ్ర 2047 ప్రణాళికకు సంబంధించి గోడ ప్రతులను ప్రత్తిపాటి పుల్లారావు ఆవిష్కరించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్వర్ణాంధ్ర 2047 విజన్‌పై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్ వైపు నడిపించటమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల లక్ష్యమన్నారు. ప్రతి పనికి రాజకీయ నాయకుల దగ్గరకు వెళ్ళాల్సిన అవసరం లేదని, చట్ట ప్రకారం చేయదగిన పనులన్నీ అధికారులే చేసే పరిస్థితి కూటమి ప్రభుత్వం కల్పించిందన్నారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా వంద రోజుల్లోనే ఎన్నో అద్భుతాలు చేశామని, సూపర్-6 హామీలను తప్పనిసరిగా అమలు చేస్తామని ప్రత్తిపాటి తెలిపారు. వికసిత భారత్ 2047కు ప్రణాళిక సిద్ధం చేస్తున్న నేపథ్యంలో స్వర్ణాంధ్ర దార్శనిక పత్రం విడుదలకు సీఎం చంద్రబాబు చొరవ చూపుతున్నారన్నారు. దీనిలో భాగంగానే ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారన్నారు. జిల్లా సబ్ డివిజన్ కేంద్రాల్లోనే రెండు, మూడు అన్న క్యాంటీన్‌లు ఉన్నాయని, రాష్ట్రంలో మూడు అన్న క్యాంటీన్‌లు ఉన్న నియోజకవర్గం చిలకలూరిపేట మాత్రమేనని తెలిపారు. గత ఐదు సంవత్సరాలుగా చిలకలూరిపేట అభివృద్ధికి నోచుకోలేదని, జగన్‌రెడ్డి పుణ్యమా అని ఐదు సంవత్సరాలు వెనుకబడి పోయామన్నారు. 2047 నాటికి దేశంలో ఏపీ నెంబర్-1 స్థానంలో ఉండాలని కోరుకుంటున్న ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పిల్లలకు మంచి ఉన్నతమైన భవిష్యత్తు ఇవ్వాలనే ముందు చూపున్న నాయకుడు ఈ దేశానికి, రాష్ట్రానికి అవసరమని ప్రత్తిపాటి అన్నారు.

రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 26: నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీచేశారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి, సిబ్బంది పనితీరును రికార్డులను ఎఫ్ఐఆర్ ఇండెక్స్ కేసు డైరీలను పరిశీలించారు. పోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెండింగ్‌కు గల కారణాలు తెలుసుకుని, విచారణ వేగవంతానికి పలు సూచనలు చేశారు. విజువల్ పోలీసింగ్ నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ మద్యం, గంజాయి నిషేధిత పదార్థాల నివారణకు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ కిషోర్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వినుకొండ టౌన్, సెప్టెంబరు 26: ప్రమాదవశాత్తూ ద్విచక్రవాహనంపై నుంచి కిందపడి ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటన పట్టణ సమీపంలోని ఏనుగుపాలెం రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే ద్విచక్రవాహనం ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్న శివశ్రీను, ఆయన స్నేహితుడు ఏసుబాబు ద్విచక్రవాహనంపై ఏనుగుపాలెం వెళ్లారు. తిరిగి వినుకొండ వస్తుండగా పెట్రోల్ బంకు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి కిందపడి గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడిన ఇద్దరు వ్యక్తులను 108సాయంతో వినుకొండలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. శివశ్రీను పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఏసుబాబుకు స్వల్ప గాయాలయ్యాయి.



వేల్పూరులో ఎరువులు పంపిణీ చేస్తున్న ఏడీఏ రవిబాబు

అందుబాటులో అన్ని రకాల ఎరువులు

● వినుకొండ వ్యవసాయ సంచాలకులు రవిబాబు

వేల్పూరు (శావల్యాపురం) సెప్టెంబరు 26: వినుకొండ నియోజకవర్గంలోని సొసైటీలు, ప్రైవేటు డీలర్ల వద్ద రైతులకు కావలసిన అన్నిరకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని వినుకొండ ఏడీఏ బోయపాటి రవిబాబు అన్నారు. ఏడీఏ ఆధ్వర్యంలో మండలంలోని వేల్పూరు సొసైటీ కార్యాలయంలో గురువారం రైతులకు డీఏపీ, యూరియాలను పంపిణీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ వినుకొండ పట్టణంలో డీలర్ల వద్ద 450మెట్రిక్ టన్నుల యూరియా, 250మెట్రిక్ టన్నుల డీఏపీ, నియోజకవర్గంలోని సొసైటీ కార్యాలయాలలో 250మెట్రిక్ టన్నుల యూరియా, 250మెట్రిక్ టన్నుల డీఏపీ అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరలకు ఎరువులను విక్రయిస్తే వారి లైసెన్సులు రద్దుచేసి 6ఏ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డీలర్లు ఎవరైనా అధిక ధరలకు ఎరువులను అమ్మినట్లయితే రైతులు 8331056959 నెంబరుకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. రెండురోజుల వ్యవధిలో మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాలకు యూరియా, డీఏపీ ఎరువులు వస్తాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శావల్యాపురం సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాద్, ఏఈవో పూరేటి అశోక, నేతలు దొడ్డా ఏడుకొండలు, సాదినేని కృష్ణమూర్తి, రావి నరసింహారావు, కొనకంచి మురళి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర 2047ను సాకారం చేసేందుకు కృషి చేయాలి

● శావల్యాపురం ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం, సెప్టెంబరు 26: 2047నాటికి భారతదేశం ప్రపంచ దేశాలలో అగ్రగామి దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వర్ణాంధ్ర 2047ను సాకారం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలపై అవగాహన కల్పించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలు కూడా తమ విలువైన సలహాలు, సూచనలను ప్రభుత్వం రూపొందించిన క్యూఆర్ కోడ్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేసి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఆయనతో ఈవోపీఆర్డీ సుగుణ పాల్గొన్నారు.